నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
గురువారం 23-7-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

## నమ్మలేని నిజాలు

మూగ చెవిటి
జనతా వ్యవహారం
ఇదే ప్రగతి

చీకటి రోజు
మారణకాండ దినం
క్రాంతి వచనం

ఆకలి యజ్ఞం
పరిహార యజ్ఞం
రెండే వర్గాలు

జనం చావనీ
ఉన్నవాళ్లు ఓటర్లు
స్వార్థ పరులు

జలకళలు
చినుకుల చిత్రాలు
నవ్విన నాగలి



– రేడియమ్
సెల్: 9291527757

## శ్రీనిజాలు

వచ్చే నెలలోనే మనకు
వచ్చేస్తుందోయ్ టీకా !
పిక్కటిల్లె గొంతుల్తో
పెట్టండోయ్ ఓకేకా !

సిద్ధమైన యుద్ధభూమి
మీటుతుంటె రుద్రవీణ !
వాక్సిన్ ఆయుధానికిక
వణుకకుండున కరోనా ?



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## ఆవిరి

నిన్నెవ్వడు సృష్టించాడో గాని
నిజంగా మా దృష్టిని మళ్లించావు
అమ్మ ఆవిరి పడుతుంది
నాన్న కాషాయం త్రాగుతున్నాడు
తాతయ్య వేపపుల్ల కావాలంటాడు
అమ్మమ్మ తులసిని మ్రొక్కుతుంది
అక్క గడపకు పసుపురాస్తుంది
చెల్లె పారాణిలేకుండా నడవనంటుంది
అన్నయ్య అందరితో మాట్లాడటం మానుకున్నాడు
తమ్ముడు మూతికి తాళం వేసుకున్నాడు
పరుగులు దీసే కాళ్లు వాకిళ్లు దాటడంలేదు
ప్రతి వస్తువూ పరీక్షించే పరిస్థితి
టెలివిజన్, టెలిఫోన్ కనుగొన్న దెవరోగాని
మాకు ప్రాణ స్నేహితులయ్యారు.
పట్నాల మీది ఆశలు పల్లెబాట పడుతున్నాయి
పర్యావరణ పరిరక్షణకు నడుం కడుతున్నాయి
పాలు కల్తీ చేయాలని పాలవాడనుకోవడం లేదు
పరీక్షలంటే విద్యార్థులు భయపడడం లేదు
కోపాలు, తాపాలు కొండెక్కాయి
కసిరింపుల బదులు బుజ్జగింపులు కనిపిస్తున్నాయి
పాపాలు మనుషుల నుంచి తప్పించుక తిరుగుతున్నాయి
గుడి తలుపులు బడి తలుపులు మూసుకున్నాయి
గుండె గుడి తలుపులు తెరుచుకుంటున్నాయి
నాస్తికులకు దేవునిపై నమ్మకం కుదురుతుంది
మనిషిని మనిషి ప్రేమించే ధోరణి పెరుగుతుంది
అంగళ్లతో మోసాలకు చెల్లుచీటి
అంతటా మంచికి పెరుగుతున్న పోటీ
అందరిలో మార్పు, అంతటా మార్పు
కరోనా! కాలామే ఇస్తుంది తీర్పు
ఇంకా పరీక్షించకు మా ఓర్పు
రేపటి సూర్యుడు మందై నిన్నార్పు.



– మసన చెన్నప్ప
సెల్:9885654381

# కాసోజు చెక్కిన రసవత్తర గజళ్ళు

స్వర్ణశిల్పి అయిన కాసోజు లక్ష్మీనారాయణ యిదివరలో తన అక్షరాలతో పద్యాలు, గేయాలు, కీర్తనలు, వచన కవితలు, నాటికలు, నానీలు చెక్కి గ్రంథాలుగా తీర్చిదిద్దారు. ఈ రచయితకు గజళ్ళు అంటే మక్కువ. సినారె గజళ్ళను వినడం, పెన్నా వారి పుస్తకాలు చదవడం. తద్వారా గజళ్ళ రచనలో మెలకువలు ఆకళింపు చేసుకుంటు నాలుగు దశాబ్దాలుగా అప్పుడొకటి, అప్పుడొకటి రాసుకున్న గజళ్ళను ఒక చోట పేర్చి 'రసమంజూష' పేరిట ఓ తెలుగు గజళ్ళ సంపుటిని తాజాగా ప్రకటించారు.

రసమంజూష' అంటే షడ్రుచుల పెట్టె, లేదూ రసాలూరించే పాత్ర. రసవత్తరంగా తీర్చిదిద్దిన గజళ్ళ పొత్తం అన్నమాట.

మాత్రాగణ బద్ధమైన గేయ కవితా ప్రక్రియగా ఉర్దూ సాహిత్యంలో విశిష్ట స్థానం 'గజల్'ది. గజళ్ళను తెలుగు వారికి 'గాలిబ్ గీతాలు' అనువాదంతో పరిచయం చేసింది మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు. స్వంతంగా తొమ్మిది తెలుగు గజళ్ళు రాసిన తొలి తెలుగు గజల్ కవి దాశరథి గారే.

మానవీయ ప్రగతి చైతన్యం, అధిక్షేపం వస్తువులుగా తెలుగు గజళ్ళు రాసిన ఘనత మహాకవి సినారెకు దక్కింది. గజళ్ళకు అత్యంత ప్రాచుర్యం కల్పించి తెలుగు గజళ్ళను విశ్వవ్యాపితం చేసినవారు సినారేనే.

ఆయన మానస పుత్రుడు కేశిరాజు శ్రీనివాస్ సినారె గజళ్ళని దేశ విదేశాల్లో గానంజేసి 'గజల్ శ్రీనివాస్'గా వినుతికెక్కాడు.

**"జీవితాన్ని ఎత్తి పోసినదే ఈ గజల్**
**భావనలో మునిగితేలి యాడినదే ఈ గజల్"**

అంటున్న కాసోజు వారికి సినారె అన్నా.. వారి గజళ్ళన్నా అత్యంత ప్రీతి.

**"తెలుగులో గజళ్ళ వాన కురిపించిన కవి సినారె**
**తన గళరవ గాంధర్వం మన చెవిలో పోసినారె!"**

అన్న షాయరీ (మత్లా)తో మొదలు పెట్టి
"దేశం నలు చెరగులందు ప్రతి కవిలో ప్రతిఫలించె
కనలేదా? 'కాసోజు' నీ గజళ్ళలో "సినారె" అన్న మఖ్తాతో ముక్తాయిస్తారు. చిట్ట చివరి షేర్‌లో 'కాసోజు' అంటు తన పేరును తెలుపుకుంటున్నాడు కవి. దీన్ని 'తఖల్లుస్' అంటారు. ఎనిమిది షాయరీలున్న 'గజళ్ల వాన సినారె' గజల్‌లో..సినారె, పోసినారె, రవళించినారె, మొసగినారె, మెరిసినారె, మురిసినారె, చేసినారె వంటి ఖాఫియాలు (అంత్య ప్రాసలు)ప్రయోగించి అందంగాతీర్చి దిద్దారు. వీరి సింహభాగం గజళ్ళలో 'రదీఫ్' (ఖాఫియాకు ముందుండే మరో ప్రాస పదం) కనబడదు. 'రదీఫ్' లుప్తమైన గజళ్ళను 'గైర్ మురద్దఫ్ గజల్' అంటారు.






ప్రముఖ సాహితీ విమర్శకులు డా॥ పెన్నా శివరామకృష్ణ తన పీఠికలో "సినారెగారు తమ గజళ్ళకు బాగా ప్రచారం కల్పించుకున్నారు. ఆయన ఎంతగా తమ గజళ్ళకు ప్రచారం కల్పించుకున్నప్పటికీ.. ఉర్దూ గజళ్ళను గూర్చి అవగాహన కలిగిన వారెవ్వరూ 'సినారె గజళ్ళను' అసలు సిసలైన గజళ్ళుగా పరిగణించలేదు" అని అభిప్రాయపడ్డారు. మరో అడుగు ముందుకేస్తూ "సినారె గజళ్ళకు లభించిన ప్రచారానికి భ్రమసి, సినారెను ఆదర్శంగా తీసుకుని ఇటీవల అనేకులు గజళ్ళ సంపుటాలను ప్రచురిస్తున్నారు" అని కూడాపేర్కొన్నారు. బహుశః కాసోజు కూడా ఆ కోవలోని వాడని నర్మగర్భంగా చెప్పినట్టయింది. విశేషం ఏమిటంటే ఇటీవల తెలంగాణ సాహిత్య పరిషత్తు వారి 'సినారె సాహితీ పురస్కారం' అందుకున్న సాహితీవేత్త పెన్నా. ఎంతో సాధికారితతో బాధ్యతాయుతంగా చేసిన పెన్నా వారి వ్యాఖ్యలు గమనార్హం.

**"నగరం నడిబొడ్డులోన కన్నుగీటి రమ్మన్నది**
**వన్నె లారబోసుకుని పిలవకనే పిలిచింది"**
**ఏ మానవ మృగ దంష్ట్రాకీలల్లో నలిగిందో**
**'కాసోజు' కల్లగాదు పురుగుల బారినపడ్డది!"** అంటు కన్నుగీటి రమ్మన్న'నెరజాణ విశృంఖ తపోకడలను 'గజల్'లో బంధించి కాసోజు అందించిన తీరు హృద్యంగా గోచరిస్తుంది.

ప్రేమ, విరహం ప్రాతి పదికగా సూఫీ తాత్వికత గజళ్ళకు ప్రాణంగా వుండేది. కానీ నేటి కవులు సమకాలీన సమాజంలో ఎదురవుతున్న సంఘటనలను, సందర్భారాలనే గాక ప్రకృతి, విలువలు, రాజకీయాలు, రైతులు, స్త్రీలు, తల్లిదండ్రులు మొదలైన అనేక అంశాలను వస్తువులుగా స్వీకరించి గజళ్ళను రాస్తున్నారు. ఒక ప్రక్రియను సామాజిక, సాహిత్య ప్రయోజనాలకు కవులు వినియోగించుకోవడం శుభ పరిణామం.

'నెలవంక-నెమలీక' మాసపత్రిక గజళ్ళకు పెద్దపీట వేస్తు 'గజళ్ళ మొయిళ్ళు' శీర్షికన గజల్ కవులను ఇతోధికంగా ప్రోత్సహించడం సాహితీ ప్రియులందరకు విదితమే. ప్రతిభావంతులకు 'కలహంస' పేరిట ప్రతి ఏటా పురస్కారాల నందిస్తు గౌరవిస్తున్న సాహిత్య పత్రిక యిది. కాసోజు లక్ష్మీనారాయణ వరుసగా మూడు సంవత్సరాలు 'కలహంస' (రాజహంస)పురస్కారం స్వీకరించిన గజల్ కవి. తన ఆనందాన్ని ఎలా వ్యక్తపరుస్తున్నాడో చూడండి.

**"విరిసింది నెలవంక నెమలీక 'కలహంస'**
**సాహిత్య సౌందర్య సౌజన్య 'కలహంస'**
**కమ్మని భావాల సింగారముల పూత**
**కదిలింది కమనీయ కవితాత్మ' కలహంస'**
**నిగనిగల సారస్వతం నితనూతనం**
**మెరిసేటి విరిగంధ తిలకమే 'కలహం'.**
**ఈప్సితంబుల దీర్చుఇంపైన మృదుగమన**
**రస వీణియల రాగ రమణీయ 'కలహంస'**
**సుందరం సుమనోహరం స్ఖలిత చందనం**
**ఆనంద తుందిలం అభినవం 'కలహంస'**

తనకందిన పురస్కారంతో పులకరించిన ఓ సంస్కారవంతుడి స్పందన యిది.

కృప్తత, సంక్షిప్తత, సరస భావన, చమత్కార ఖేలన, ఇంపు, కుదింపు, గజల్ జీవ లక్షణాలు. అన్నింటి కన్న చమత్కారం ముఖ్యం. అదే గజల్‌కు ప్రాణం, ధ్వని, ఆత్మ. ఈ లక్షణాలతో రాసిన గజళ్ళుపాఠకులను అలరిస్తాయి.

మరో ప్రముఖ తెలుగు గజల్ కవి సూరారం శంకర్ అందించిన ముందు మాట రసవత్తరంగా వుంది. కాసోజు గజళ్లను సోదాహరణంగా విశ్లేషించిన తీరు ఆసక్తికరంగా, విజ్ఞానదాయకంగా సాగింది. 'గజల్' ప్రియులందరు చదవాల్సిన సంపుటి 'రస మంజూష'.

ప్రతులకు: కాసోజు లక్ష్మీనారాయణ
ఇ.నం. 18-8-434/19
లలితాభాగ్, ఉప్పుగూడ
హైదరాబాద్-500 053
సెల్: 99498 18286



– రమణ వెలకమన్ని
సెల్: 98660 15040

## వాహ్యాళి వరపుత్రిక

ఉదయం పూట వాహ్యాళి
ఉదయ భానుడి సాహచర్యం.
పచ్చని నిశ్శబ్దం
పర్యావరణమంతా పరచుకున్న సమయాన
వీచే గాలిలో
కాస్త కల్మషం తగ్గిన వేళ
హుషారుగా సాగే నడకలో
అడుగులు
ఎంత వేగంగా పడినా
అంతకంటే ఎన్నో రెట్టింపులుగా
అప్పుడే కడిగిన ముత్యంలా ఉన్న
నా మస్తిష్కంలో
ఏవో కొత్త మెరుపులు
ఆలోచనల ముసుర్లు.
నా కళ్ల ముందే కొన్ని
భావ ద్రవాలై
అందంగా ఘనీభవించిన అక్షర కూర్పులై
పద ప్రవాహాల వాటికలై
తెల్లని కాగితంపై వెలిచాయి
నర్తించే నల్లని నాట్య శిల్పాలై.
'పలికెడిది భాగవతమట
పలికించువిభుండు రామభద్రుండట!'



-ఆచార్య కదారు వీరారెడ్డి
9392447007

## సాధించాలంటే ..?

నేర్చుకునే కాలంలో ఎవరికైనా తప్పవు
తప్పటడుగులు
సరిచేసుకుని పరుగెత్తటమే
ఓటమి ఎన్నో విధాల పరిహసించినా
గెలుపు కై పోరాడటమే
గమ్యసిద్ధికి మార్గం
నిరాశ నిండుగ మబ్బులా కమ్మేస్తున్నా
మత్తు విదుల్చుకోవల్సిందే
ఆశను ఆసరాగా తీసుకోవటం తప్పనిసరి
విజయం జెండా ఎగురెయ్యాలంటే
విడువని పట్టుదల ముఖ్యం
పడత్రోసే వారిని నెట్టుకుంటూ
నిచ్చెన పైకి ప్రాకాలి
సామర్థ్యత ఆసరా లతలా మలచుకుంటే
జయం మనదే!



-యలమర్తి అనూరాధ
9247260206

వీలు కానప్పుడు పులి కూడా
రెండడుగులు వెనక్కి వేస్తుంది.
అది భయం కాదు....
ఎదురుగా కొండ వచ్చిందనీ
నది కూడా పక్కకు జరుగుతుంది.
అది ఓటమి కానే కాదు....
వెనక్కి రావడమనేది
ముందుకు పోవడంలో ఓ భాగం.
జీవితాన్ని యథాతథంగా ఎదుర్కోవడం.

-మునిమడుగుల రాజారావు

పుస్తక సమీక్ష

# వినూత్నంగా 'కొత్త క్యాలెండర్'...!



"కవి అనే వాడు చేయాల్సిందల్లా ఒక్కటే.. కవిగా కరిగిపోయి.. కరిగిపోయి.. కవితగా ప్రపంచంలోకి ప్రవహించటమే'' అని భావించే డా॥ రావి రంగారావుగారు పద్యకవిగా, వచన కవిగా మినీ కవితా పితామహుడిగా, విద్యావేత్తగా బాల సాహిత్యవేత్తగా భాసిల్లుతూ.. 80 కవితలతో 'కొత్త క్యాలెండర్' పేరుతో మరో కవితా సంపుటిని ప్రకటించారు.

జనంలోకి ఇంకిపోయి ఇంకిపోయి మనుషులలో మానవతా మొక్కగా మొలకెత్తటమే, మనసులలో పరిమళాలు చక్కగా ప్రసరించటమే కవి యొక్క కర్తవ్యమని గట్టిగా విశ్వసించే రంగారావుగారు ఈ గ్రంథంలో విభిన్నమైన వస్తువులను తమ కవితలకు ఇతి వృత్తాలుగా ఎంపిక చేసుకుని వినూత్నమైన రీతిలో అభివ్యక్తికరించారు.

క్యాలెండర్ మారిందని బతుకులు మారవు.. కాకపోతే బతుకు రంగును ఓసారి చూసుకో వచ్చునీ.. అవసరమైతే మళ్లీ తీర్చి దిద్దుకోవచ్చని హితవు పలుకుతూ.. కొత్త క్యాలెండర్ కవితను రాశారు. దానినే ఈ పుస్తకంలో మొదటి కవితగా మనకు అందించారు.

కొత్త సంవత్సరం అనగానే
కొత్త క్యాలెండర్ వస్తుంది.

వెలుగునీడల మధ్య పడినలుగుతూ పరుగెత్తుతున్న మనిషికి కాస్త విశ్రాంతినిస్తుందని పేర్కొన్నారు. జీవనం పరుగులో అలిసిన మనిషికి.. క్షణకాలం ఆగినపుడు మంచి నీళ్ళు అందించే దారిసత్రం కొత్త సంవత్సరమని వర్ణించారు. మళ్లీ మనిషి పరుగు మొదలు పెట్టాల్సిందే. చివరి మైలు చేరే దాకా సాగాల్సిందేనని తెలియజెప్పిన తీరు బాగుంది.

'నువ్వే ఓ కొత్త క్యాలెండర్" కవిత ద్వారా కొత్త క్యాలెండర్లు మెడనిండా దండగా వేసుకుని ఏం లాభం? కృషిని నీ గుండెలో నాటాలని సూచించారు. ప్రపంచం కోసం మంచి పంట పండా లని కాంక్షిం చారు.

'ఒక్క క్షణం చాలు'' కవితలో జీవితమంతా అప్రమత్తంగా ఉండాలని ప్రబోధించారు.

'అద్దం' కవిత ద్వారా కొత్త అద్దంలో పాత మనిషిని చూడు.. స్పష్టంగా కనిపిస్తాడని.. పాత అద్దంలో మాత్రం కొత్త మనిషిని చూడకు..సరిగా అర్థం కాదని.. నీ కన్నీ విద్దూరాలే గోచరిస్తాయని వివరించారు. 'తిరుగు ప్రయాణం' కవితలో

జీవితంలో
తిరుగు ప్రయాణం.. తెలియనివాడు. చెట్టును శాశ్వతంగా పోగొట్టుకున్న పక్షిలాంటి వాడని.. తల్లి ఒడిలోకి రాకుండా తప్పిపోయిన పిల్లవాడని వ్యాఖ్యానించారు.

అయ్యప్ప గుడిలోకి మహిళల్ని అనుమతించిన సుప్రీంకోర్టుకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్న భక్తులను ఎండగడుతూ 'కొత్తరకం రాక్షసులు' కవితను రాశారు.

'అంతా నిశ్శబ్దంగా జరిగిపోతుంది' కవితను సందేశాత్మకంగా మలిచారు.

శబ్ద నిశ్శబ్దాలను విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు. మనసున్న నిశ్శబ్దం హంస.. మనసులేని శబ్దం హింస అని తేల్చి చెప్పారు.

శబ్దం ఒక ఆయుధమనీ.. అర్థం తెలియకుండా ప్రేమించకు గాయపడతావని..నిశ్శబ్దం చేతికర్ర, ప్రేమించు, పడకుండా నిలబడతావని హితవు పలికారు.

కవి రంగారావుగారు 'అందరూ వెళ్ళిపోతు న్నారు కానీ' కవితను తాత్త్వికంగా తీర్చిదిద్దారు.

'ఆకాశం పువ్వులు' కవితలో కవి తమ భావుకతను ప్రదర్శించారు. ఆకాశం మొక్కకు పూచిన పువ్వులు చుక్కలు..కాంతుల పరిమళాలు వెదజల్లుతుంటే అందరి కళ్లు ఆ పువ్వుల మీదే పడ్డాయని కవి తమ భావాలను చక్కగా ఆవిష్కరించారు.

చీమను చిన్నారి శ్రమజీవిగా వర్ణిస్తూ రాసిన కవిత ద్వారా.. చీమయొక్క ఔన్నత్యాన్ని చాటి చెప్పారు.

'తీర్మానాలు' కవితలో తీర్మానాలంటే..కాగితాల మీద విసిరే పరిమళాల పువ్వులని.. నిర్భయంగా తిరిగే వెలుతురు గువ్వలని అభివర్ణించారు.

కంచం లాగే.. మంచి కూడా చాలా ముఖ్యం అంటూ "మంచం" కవితను తీర్చిదిద్దారు.

'వర్షం' కవిత ఆద్యంతంగా కవితాత్మకంగా ఉంది. మనసుల్ని కడుగుతున్న వర్షం.. మనసుల్ని కూడా కడిగితే ఎంత బాగుటుందని అభిప్రాయ పడ్డారు.

'చెప్పి వెళితే బాగుంటుందేమో" కవితలో బతికితే చెట్టులా బతకాలని..పోతే పిట్టలా పోవాలని చెప్పారు.త

"పాడని పాటకు చప్పట్లు" కవిత యొక్క ప్రారంభ పంక్తులు బాగున్నాయి.

సూర్యుడిని డాక్టరుగా వర్ణిస్తూ రాసిన కవితలో కవి ప్రకటించిన భావాలు ఆలోచనాత్మకంగా కొలువు దీరాయి!

"కవిగారి పంచాంగ పఠనం" కవితలో.. .నడుస్తున్న చరిత్రకు అద్దం పట్టారు.

పెరిగిపోతున్న పెట్రోలు ధరలను నిరసిస్తూ 'బైక్ ఆత్మహత్య' కవితను రాసి మెప్పించారు. 'మనసు' కవితలో.. ఔషధమైనా..విషమైనా మనసులోంచే తయారయ్యేదని పేర్కొన్నారు.

'పుస్తకం ఒక సముద్రం' కవితలో పుస్తకాన్ని ఓ కల్పతరువుగా.. వివిధ కాంతి ప్రసార గురువుగా ఆవిష్కరించారు.

'ప్రశ్న ఒక వెలుతురు' కవితలో ప్రశ్న ఒక అగ్గిపుల్ల.. సరిగా వెలిగించు.. ప్రశ్న ఒక ఆడపిల్ల.. సున్నితంగా గౌరవించుమని సూచించారు.

'ఉదయాన్ని మనమే కాచుకోవాలి' కవితలో ఉదయం యొక్క గొప్పదనాన్ని చక్కగా తెలియజెప్పారు.

ఉదయం మించిన నవ్వు, పువ్వు, ధాన్యం, సైన్యం, లేదని తేల్చి చెప్పారు.

**ఈ విశ్వానికి ఉదయం**
**మొన్న తాత**
**నిన్నతండ్రి**
**నేడు బిడ్డ** అని పేర్కొన్నారు.

"సంధ్యా సమయం" కవితలో సూర్యుడు గిరిశిఖరానికి పెట్టిన కిరీటమని వర్ణించారు. సంధ్యా సమయాన్ని అందంగా దృశ్యమానం చేశారు.

మొదటి అట్ట జనం
చివరి అట్ట మరణం

రెండు అట్టల మధ్య ప్రవహించే జీవన సారం పుస్తకమంటూ కవి రంగారావుగారు తమ తాత్త్విక చింతనను ప్రకటించారు.

ఇలా ఎన్నో కవితా పంక్తులు ఉదహరించడానికి ఈ గ్రంథంలో ఉన్నాయి. రంగారావుగారి కవిత్వంలో ఆయన ఉత్తమ సంస్కారాన్ని.. ఉన్నత వ్యక్తిత్వాన్ని సామాజిక చింతనను చూస్తాం. అపార అనుభవాన్ని రంగరించి రాసిన రంగారావుగారి కవితలు వినూత్న ఆలోచనలకు తెర లేపుతాయి. కర్తవ్యాన్ని ప్రబోధిస్తాయి. అన్నింటికి మించి సన్మార్గానికి బాటలు వేస్తాయి. ఆలోచనాత్మక, సందేశాత్మక ముఖ చిత్రం పుస్తకానికి నిండు శోభను కూర్చింది. తమ అంతరంగంలో సవ్వడి చేసే భావాలను అక్షరాల్లో బంధించి మనతో పంచుకున్న రంగారావుగారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం.

ప్రతులకు: నర్రా ప్రభావతి
కన్వీనర్
రావిరంగారావు
సాహిత్యపీఠం, 101, శంకచక్ర నివాస్
అన్నపూర్ణనగర్, 5వ లైన్ తూర్పు
గోరంట్ల, గుంటూరు-522 034.
సెల్: 9427581825






– దాస్యం సేనాధిపతి
94405 25544

## విశ్వవిజేత

ఒలింపిక్స్ కప్పుతో విశ్వవిజేతలా నించున్నట్లు
కొమ్మలతో పూరెమ్మలతో
పూలసజ్జలాగా పండ్లబుట్టలాగా
ధీమాగా పలకరించి
మము పులకరింపచేసే పచ్చని వేడుకలా
బాటకు కట్టిన పచ్చని తోరణమే అయినట్లు
విశాలమైన నీ బాహువులు చాచి మరీ పిలుస్తున్నట్లు
ఉడుతలు సీతాకోకలు పక్షులు
ఒంటరిగా ఒంటికాలిపై
తపస్సు చేసుకుంటున్న ఋషి పుంగవుని
ఆశ్రమానికి వచ్చినట్లు
ఆ ఆశ్రయమే ఎందరికో విశ్రామమై
శాంతిని నెలకొల్పే ఆరామమైనట్లు
వీచే గాలులకు ఆకులు
ఆనందతాండవం చేస్తున్నట్లు
కొమ్మలు రెమ్మలు హ్వయలొలికిస్తున్నట్లు
ఆ పూపరిమళం చెప్పకనే చెబుతుంది
నువ్వు ఆనందంగా ఉన్నావని
కావ్యనాయికలనే మరిపించును
నీ పూలసోయగం
హరివిల్లునే తలపించును
ఆ రంగుల సింగారం
హృదయ ద్వారాలను తెరిచినట్లుండే
విరుల సుగంధం
మనసును తేలిక చేసి తేలియాడునట్లుచేసి
అలా అలా అదో లోకంలో
విహరించేట్లు చేయునులే
గట్టినేలను చీల్చి నిలబడే లక్ష్యము నీది
గాలి ధూళి దుమారాలకు
ఎదురీదే ధైర్యము నీది
ఎంత ఎదిగినా ఒదిగి ఉండే తత్వము నీది
చొచ్చుకొని పోయే చొరవ నీది
చెప్పకనే చెబుతావు ఆత్మవిశ్వాసము
ఉంటే ఏదైనా సాధ్యమని
చేసి మరీ చూపిస్తావు
నిన్ను చూసి నేర్చుకోమని
నేలమ్మకు గొడుగువై
కడతేరువరకు అంటిపెట్టుకునే తోడువై
సారము పోనివ్వని సంస్కారము నీవై
అపారమైన ప్రేమకు చిరునామావై
రాళ్లతో దెబ్బలు తిన్నా
గాయాలు కాయాన్ని బాధిస్తున్నా
అమ్మలాగ కడుపునింపే అనురాగమూర్తివి
గాంధీ తత్వానికి వారసురాలివి
ఫలములిచ్చినా ఫలితముండని జంతురాజకీయాలకు
నిలువెత్తు సాక్ష్యం నీవు
మనుషుల స్వార్థానికి ఏళ్ళ తరబడి
బలవుతున్న స్త్రీ జాతికి ప్రతీకలా నువ్వు
ఒడలంతా ప్రాణమై జగతికి ఆధారమై
గొడ్డలి పోటుకు కూడా వెరువక
కరిగే కొవ్వొత్తిలా కాలే వత్తిలా
చిగురిస్తూనే ఉంటావు
చిరుదీపంలా వెలుగు నింపుతూనే ఉంటావు
ఎదిగే నీ ప్రతిదశ ఒక పాఠమే
మానవాళికి అదొక గుణపాఠమే
వెలకట్టలేని నీ త్యాగము
వేయిజన్మలెత్తినా తీర్చుట కష్టము
ఒక మొక్కను నాటి చక్కగ చూసైనా
ఆ లెక్కను సరిదిద్దుకో
చెట్టును నరికి
చేటుని ఆహ్వానిస్తున్న మనిషీ !!!!
కాస్త మనసుపెట్టి నీ మహిని కాపాడుకో
ప్రకృతిలో నీవూ భాగమే
బాధ్యతను పంచుకో
ప్రాణమిచ్చు పచ్చని తరువును
ప్రాణంగా చూసుకో పదిలంగా దాచుకో



-మంజుల సూర్య
9704022244

## శాంతి మంత్రం

కాలం మహాగొప్పది
విర్రవీగే మనిషికి తాళం వేసింది
మూసుకుపోయిన మనసుపొరలను
దులిపింది
లిపిలేనిభాషలాంటి కనుసైగలను కత్తిరించి
చూపును నేలపై నిలిపింది
సమయంలేదన్న సాకులకు షాకిచ్చింది

బతుకులను తల్లకిందులు చేసింది
అనిశ్చితి జీవితాలపై వైరస్ ను. వేలాడే కత్తిని చేసింది
న్యూనార్మల్(నివలి నినీతీఎజీశ్రీ)అంటూ న్యూనతనుమెళ్ళో వేసింది
కూలిపోతుందా ప్రపంచం అన్నట్లు
ఇక్కట్లు చీకట్లను భుజానేసుకుని ప్రయాణం సాగిస్తున్నారందరూ

కొత్త చట్టాలను చూసి పెదవివిరిచినంత సులభంగా
కొరోనాను వెక్కిరించకూడదని తెలుసుకున్నావుకదా
కాస్త మాస్క్ ధరించండనే సూచన మరుస్తావేం మిత్రమా
మూడుగజాలదూరం ముప్పును తప్పించే మార్గమని చెబుతున్నా
చెవికెక్కదే
సామరస్యం సహజీవనం మనుషులకే కాదు
వైరస్ లకూ అవసరమనే శాంతి మంత్రాన్ని జపిద్దాం
అనుమానాస్పదచూపులను అభద్రతా భావాలనుపూడ్చేసి
మనిషికి మనిషే అండాదండా కావాలని
చాటింపేద్దాం... ఇలా ఛాటింగ్ చేద్దాం
-సి.యస్.రాంబాబు



-సి.యస్.రాంబాబు
9490401005

## చేతికర్ర

దండమున్న చేత దశవిధ ఫలితమ్ము
లుండుననిరి బుధులు ఖండితముగ;
బుధుల నోటిమాట పొల్లుపోవున?అది
అనుభవమున చెప్పినట్టి మాట!

తెలివి గలుగువారు పలువిధమ్ములవాడి
కర్ర వలన పొందగలరు మేలు;
కర్త స్థాయిబట్టి కర్మ ఫలమ్ముండు
శస్త్ర మౌను కర్ర,అస్త్ర మౌను!

కానరావు చేతికర్రలు నగరాల
లోన,పట్టణాలలోన తరచు;
నాగరులకు నచ్చునా నాటు కర్రలు?
స్టిక్కు లుండు వారి చేతులందు!

చేతనున్న స్టిక్కు ఊతకర్రౌగాని,
చేతికర్ర సాటి చేయ దెపుడు;
పలువిధాల తనకు పనికివచ్చెడి చేతి
కర్ర పట్టుకొనును కర్షకుండు!

చేత కర్రలేక రైతు చేనికి పోడు,
కర్ర మనిషి తోడుగా రహించు;
హస్తభూషణముగఅలరారు కర్ర రై
తన్నచేత బట్టుకొన్నయంత!

కర్ర చేతనున్న కరవవచ్చిన కుక్క
తోకముడిచి దారితొలగి చనును;
కుంటికుక్క గూడ వెంటాడి తరుమును
లేనియెడల చేతిలోన కర్ర!

ఆత్మరక్షణమున కప్పుడప్పుడు కర్ర
యెంతయేని ఉపకరించుచుండు;
ముదుసలులకు కర్ర మూడవ కాలు, ది
వ్యాంగులకును నది సహాయకారి!



-హెచ్.ఆర్.చంద్రం.
9493248053

## పెంచుకున్న నమ్మకం

నేల పై పెంచుకున్న నమ్మకం
విశ్వాస జూటం నుండి జారుతూ

పొడిచిన పిడికిళ్ల పొద్దు
ఇంటి వాకిట ప్రశ్న గా మారుతూ

మోసపు తెరల స్వార్థం ఎప్పుడు
పూసుకున్న అత్తరు కౌగిలి

విధి రాసిన రాతలో తలరాత
వాలి పోతున్న మలిపొద్దు

కన్నీటి చుక్కల్ని లెక్కిస్తూ
సాగుతున్న విధి లేని భవిత

వార్తమానం దుఖ్ఖ మయం
భవిత నమ్మలేని ప్రశ్న

నా మాటిప్పుడు నాది కాదు
కబంధ హస్త అస్త్ర కానుక

నిరాశల ప్రవాహం నా జీవితం
ఊపిరాడాని మనుగడ నా అస్తిత్వం

బతుకిప్పుడు చుట్టుకున్న స్వార్థ ప్రశ్న
బతుకిప్పుడు కోరుకొని వేసుకున్న శిక్ష



-సిరిసిల్లా గఫుర్ శిక్షక్
9849062038

## భూమయ్యగారి "ప్రతిభా త్రయి"






తెలుగుభాషా సాహిత్యాలలో ఒక వినూత్నమైన శైలి, కావ్య నిర్మాన పాండిత్యం కనబరిచిన వారిలో డా॥ అనుమాండ్ల భూమయ్య గారు ఒకరు. అసామాన్యమైన ప్రతిభ కనబరచిన వారిని గురించి అధ్యయనం చేయడం, వారి పాండిత్యాన్ని గురించిన వివరాలు రచిస్తున్న గ్రంథాలు, సంకలనాలు ఇటీవల ప్రముఖులలో భూమయ్యగారు ఒకరు. గురువు ప్రతిభను కొనియాడుతూ భక్తితో, భూమయ్యగారిని అధ్యాపక వృత్తిలో ఒక ఆదర్శప్రాయంగా గుర్తించి, వీరి వద్ద ఎం.ఏ, పిహెచ్‌డి చేసిన ముగ్గురు విద్యార్థినులు డా॥ కె. ప్రియదర్శిని, డా॥ ఎన్.ప్రభావతీ దేవి, డా॥ ఎస్. రాధిక తమకున్న గౌరవ భావంతో భూమయ్యగారిని గురించిన అనేక విషయాలతో "ప్రతిభాత్రయి" అనే గ్రంథాన్ని ప్రచురించారు. ఇది అరుదైన విషయం. డా॥ అనుమాండ్ల భూమయ్య గారి శిష్యులలో అత్యధికులు అధ్యాపక వృత్తిని చేపట్టడం, మాకు పాఠాలు చెప్పిన సార్ ఉత్తమ అధ్యాపకునిగా రాష్ట్ర ప్రభుత్వం చేత గుర్తింపు పొందడం మాకు ఆనందదాయకం అంటూనే, ఈ గ్రంథంలో వీరి ప్రశస్త కవితారచన, కావ్య శాస్త్రానుశీలనం, నిశిత విమర్శ, స్నేహతత్త్వం, సహృదయత, వినయం, సౌశీల్యం వంటి అరుదైన అంశాలను ప్రస్తుతించారు.

గ్రంథాన్ని పరిశీలించి వీరి గురించి కొన్ని విషయాలు తెలపాలంటే.. ఇప్పటివరకు వీరు 17 విమర్శనా గ్రంథాలు రచించారు. మొదటగా వెలువడిన 76 వ్యాసాల సంపుటి "విమర్శ విద్యాసార్వభౌమం" పేరుతో 2013లో వెలువడింది. 1994లో "వేయినదుల వెలుగు" అనే పద్యకావ్యం వెలువడి ఉత్తమ కావ్యంగా తెలుగు విశ్వవిద్యాలయం వారి పురస్కారాన్ని, గరికపాటి సాహితీ పురస్కారాన్ని అందుకుంది. ఆ తర్వాత వచ్చిన కావ్యాలు వెలుగున గల హంస, అగ్నివృక్షము, చలువ పందిరి, జ్వలిత కౌసల్య కూడా అనేక ప్రశంసలను, పురస్కారాలను అందుకున్నాయి. ఆపై 2003 సం॥లో వీరు రచించిన "అంతర్వీక్షణ సార్వభౌమం" పేరుతో 50 విమర్శనాత్మకమైన వ్యాసాలు వెలువడ్డాయి. అధ్యాపనము శీర్షికన 55 మంది శిష్యులచే ఎంతో విలువైన అభిప్రాయాలను సేకరించారు. విమర్శనము శీర్షికన అనేకమంది కవులు, రచయితలు, విమర్శకులు వీరిపై, వీరి ప్రతిభపై, వీరి శైలీ వైశిష్ట్యంపై వ్యక్తీకరించిన అభిప్రాయాలను సేకరించి పొందుపరిచారు. ప్రముఖులు ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య, ఆచార్య నాయని కృష్ణకుమారి, చేకూరిరామారావు, ఆద్యుడు కట్టమంచిపై డా॥ నారాయణరెడ్డి, వేలూరి శ్రీదేవి, నాగసూరి వేణు గోపాల్ తదితరులు, మాలపల్లి మహాకావ్యంపై డా॥ సి. మృణాళిని, బి.ఎస్ రాములు, ఆచార్య రాచపాళెం, వేమన అనుభవసారము పై డా॥ ముక్తేవి భారతి, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, శైలజామిత్ర, నాయనితో కాస్సేపు పై ఆచార్య బేతవోలు రామబ్రహ్మం, ఆచార్య శిఖామణి, కర్పూర వసంత రాయలు కథాకళాకృతులపై ఆచార్య ఎన్.గోపి, ద్వానా శాస్త్రి, డా॥ సి. భవాని తెలంగాణ భావ విపంచికపై కాళోజీ నారాయణరావు, ఆచార్య బిరుదురాజు రామరాజు, ఆచార్య మసనచెన్నప్ప, కొండపల్లి నిహారిణి, సౌందర్యలహరి పై బూదాటి వెంకటేశ్వర్లు, శ్రీ.కె. దామోదరరావు, వ్యాసభారతిపై, సింహావలోకనంపై కూడా అనేక మంది ప్రముఖ సాహితీ వేత్తలు వారి అభిప్రాయాలను వ్యాసాలుగా వీరికి అందించారు. కవనము శీర్షికన , అనేకమంది ప్రఖ్యాత సాహితీవేత్తలు గుంటూరు శేషేంద్రశర్మ, సామల సదాశివ, అమ్మంగి వేణుగోపాల్, అఫ్సర్, గంగిశెట్టి లక్ష్మీనారాయణ, డా॥ అద్దేపల్లి రామ్మోహన రావు డా॥ రాళ్ళబండి కవితాప్రసాద్ వంటి పెద్దల వ్యాసాలను అందుకున్నారు. ఈ గ్రంథం ఎంతో అవసరమైనది. రాబోయే తరానికి ఎంతో ఉపయోగపడుతుంది.

ఒక వ్యక్తి ఎదుగుదలకు చేసే పనులు, రచించే కావ్యాలు కొన్ని కారణాలు కావచ్చు కానీ వ్యక్తిత్వం మాత్రం అసలైన కారణం. వీరిలో అలాంటి మహోన్నతమైన వ్యక్తిత్వం ఉందని భావించారు కనుకనే శిష్యులు సంపాదకులుగా మారి ఇంతటి బృహత్కార్యానికి, చిరస్మరణీయమైన గ్రంథాన్ని అందించారు. వీరికి నా అభినందనలు. పెద్దలు అనుమాండ్ల భూమయ్యగారికి నమస్సులు..

ప్రతులకు:
నవోదయ బుక్ హౌస్,
ఆర్య సమాజ్ మందిర్ ఎదురుగా,
కాచిగూడ చౌరస్తా, హైదరాబాద్.
ఫోన్: 88970 73999

–శైలజామిత్ర
9290900879

పుస్తక సమీక్ష

## ఉపయుక్తమైన "సాహిత్య వ్యాసాలు"






సాహితీ వ్యాసాలు, వ్యక్తులను గురించిన మానవీయమైన వివరాలను పొందుపరిచిన వ్యాసాలు ఎప్పటికీ ఉపయోగకరమైనవే. ఆధునికత ఎంతగా పెరిగిపోతున్నా, పుస్తకాల విలువ ఎప్పటికీ ఉంటూనే ఉంటుంది. ఎందుకంటే ఎంత గొప్ప టెక్నాలజీ అయినా విద్యుత్ ఉన్నంత వరకే. వెలుతురు లేకున్నా, వసతులు లేకున్నా మన చేతిలో గ్రంథం మనల్ని వదిలి వెళ్ళిపోదు. ఆ ఆశతోనే ఇంకా వేల కొలది ఉపయోగకరమైన గ్రంథాలు వస్తూనే ఉన్నాయి. విలువైన ప్రతి గ్రంథాన్ని మన గ్రంథాలయాలు భద్రపరుస్తూనే ఉన్నారు. డా॥ వి. త్రివేణి మనకు ఎంతో ప్రముఖులైన రచయితల గురించి, కవుల గురించి ఉన్నతమైన వ్యాసాలను మనకు అందించారు. రాబోయే తరంలో విద్యార్థులకు ఎంతో ప్రయోజన కరంగా తీర్చిదిద్దారు. పాల్కురికి అనుభవ సారం నుంచి పోతన, కొండలరాయుడు, శ్రీరామదాసు సాహిత్యం –కీర్తనలు స్వభావాలు, లక్షణాలు, పొట్లపల్లి రామారావు, కపిలవాయి లింగమూర్తి, సి. నారాయణ రెడ్డి కవిత్వం, శ్రీ తిరుమల శ్రీనివాసాచార్య జీవితచరిత్ర వంటి అత్యుత్తమమైన విషయాలను ఈ గ్రంథంలో పొందుపరచడం విశేషం.

"అలుగు" గ్రంథంలోని తొమ్మిది వ్యాసాలను ఒక కోణానికి కట్టి చూపించలేము. చెప్పలేము. ఇందులోని ఒక్కో కవి ఒక్కో విషయంలో, ఒక్కో వస్తువుపై కవిత్వం రచించిన వారు. వీరిలో ఒక్కొక్కరిది ఒక్కో శైలి ఉంది కనుక వివరణలో అద్భుతమైన ప్రతిభను త్రివేణి కనబరిచారు. పాల్కురికి అనుభవసారంలో విశేషాలు తెలంగాణ ఆదికవిత ద్విపద కాదని అనుకోకుండా రూఢీ పరిచారని అనిపిసెంత భాగవత గాథ లోని సంవిధానం ఎలా ఉంటుందన్న చర్చ ఈ వ్యాసాల్లో కనిపించింది. శ్రీ రామదాసు కీర్తనలలో దాసు లక్షణాలు, కపిలవాయి లింగమూర్తి నిర్వీరామ ఆవిష్కరణలు ఒక విభాగంగా వచ్చినా, పొట్లపల్లి గారి చుక్కలు కవిత్వ సారం, సినారెలోని ప్రతీకాత్మకత విశ్లేషాత్మక వివరణ, ఆధునిక విభాగంలోకి వస్తాయి. తిరుమల శ్రీనివాసాచార్య, వానామామలైర దాశరథి మోనోగ్రాఫీ విశ్లేషణ చక్కగా సాగాయి. వీటిలో కొండలరాయుడు, భోగంసాని వ్యాసాలు మాత్రం విషయం సాహిత్యానికి సంబంధించినది కావు. ఇందులో తెలుపబడిన వ్యాసాలన్నీ మహాకవులకు సంబంధించినవే. వీరిని గురించి ఒక వ్యాసంలో ఇమడ్చటం అంత సులువైన పని కాదు. డా॥ సినారె, కపిలవాయి గార్ల కవిత్వ విశ్లేషణలో ఎంతో ఆసక్తికరమైన విషయాలను తెలియజేయడం ద్వారా మరింతగా వారి కవితాశైలి అర్థమవుతుంది. చుక్కలు కవిత్వం పాఠకుడికి అర్థమయ్యేలా కొనసాగుతుంది. సినారెలోని కవితా ప్రతీకలను ఒకచోట చేర్చి తెలియజేయడం బావుంది.

తెలుగు సాహితీ ప్రక్రియల్లో వ్యాసం వేరు, విమర్శ వేరు. వ్యాసం అనేది వివరణ మాత్రమే. వారి రచనా రీతుల లోతులు తెలియజేయడం మాత్రమే. కానీ విమర్శ అలా కాదు. కవిత్వంలోని ఎత్తుగడనుండి ముగింపు వరకు కవితాత్మలోని అంశాల్ని, శైలిని గూర్చి ఏది ఎంతవరకు రాయచ్చును అని తెలియజేసేది. డా॥ త్రివేణి రచించినవి పరిశోధనాత్మకైన వ్యాసాలు కనుక రెండూ ద్యోతకమయ్యాయి. కత్తికి రెండువైపులా పదునే అనే తీరును కనబరిచిన తీరు అభినందనీయం..

ప్రతులకు: డా॥ వి. త్రివేణి
ఫోన్: 9951444803

–శైలజామిత్ర
9290900879



### నారాయణి

కరోనా కాలమిదీ
కనుచూపులె పనిచేస్తయ్
ముక్కులు మూతులు
మూసుకుని కూచుంటయ్!

ఏ యిద్దరు కలుసుకున్నా
దూరం దూరం
నమస్కార బాణమే
పలకరింపు
అదే క్షేమసమాచార సూచిక...

కరోనా కాలంలో
కలకలం వలదు
నర్సమ్మలే నారాయణమ్మలు!!
కరోనా బాధితులకు
రక్షకురాండ్రు
నాడైనా నేడైనా
వారే ముఖ్యురాండ్రు
అందుకే అందుకోమని
జోడిద్దాం! కరకమలమ్ముల!!

–యెనిశెట్టి గంగా ప్రసాద్.
9866447234.



### నానీలు

ఆమె
చంద్రబింబం!!
చిరునవ్వులతో...
కురిసేదంతా....వెన్నెలేగా!!
అడవి
మేలుకుంది!!
కాచే వెన్నెలను..
పూలలో నింపడానికేమో!?..

కవిత్వం
పుప్పొడై రాలుతోంది!!
వెన్నెలకు..
కవి ఎద కలువైందేమో??

గంగను,ఊరికాల్వను
గుండె కు హత్తుకుంది!
వెన్నెల...
గొప్ప యోగి సుమా!

–సుభాషిణి ప్రత్తిపాటి
8099305303

### నేచర్ హైకూ

చిగురుటాకయినా
పండుటాకయినా
నీడకు రంగేముంది

మోడు చివర పిట్ట వాలింది
ఇంకా రాలని
పండుటాకేమోననుకున్న

గాలెంత భద్రంగా
నేలకు దించుతున్నా
పువ్వు పరిమళం జారి పడింది

నెలవంక
ఒక చీలిన గాయం
వెన్నెల స్రవిస్తోంది

పాత బావే
నీరు కొత్త అద్దంలా
ఏ ముఖం తొంగి చూసిందని

ఆమె నవ్వులూ
పువ్వులు
వాడిపోయేదెంత సేపు

గువ్వెగిరిపోయింది
గూడెండి పోయింది
ఐనా చెట్టింకా మోస్తూనే

నేను బుడగ ఊదితే
వాడి కళ్ళు
పెద్దవయ్యాయి

ఆకుల సందుల్లో
జారిపడిన ఆకాశం
ఎన్ని నీలి రంగు ముక్కలో



– చిత్తలూరి
8247432521

### ఆశ

తల్లిదండ్రుల ఆశకు సాక్ష్యం
శిశువుకు జన్మనివ్వడం!

ఆశతో పుట్టిన మనిషి
ఆశ తోనే మరణిస్తాడు

జీవి జనన మరణాల మధ్యకాలం
ఆశల స్వభావం
అవితీరే మార్గం
మనిషిగా అతనికి స్థానం
సమాజం ఇస్తుంది!

ఆశకు లోబడిన మనిషి
కట్టుకొయ్యకు కట్టిన పశువవుతాడు
ఆశ మనిషిభౌతికహక్కు
తృప్తికిమనస్సు ప్రధానం

పరిమితి లేని ఆశలు
విపరీతానికి సంకేతం అర్థరహితమైనజీవితాలుగా
ఆచరణశూన్యాలవుతాయి

సమాజం మెచ్చే ఆశలు
ఆశయాలకు మూలం అయితే
జన్మ సార్థకమవుతుంది!
మరొకరికి ఆదర్శం అవుతుంది!
మానవ చరిత్రలో నీపేరు
ఓ (అ)క్షరమైనా
ఓనక్షత్రమైనా
నీఆశచేతిలోనేఉంది.

–ఓలేటి ఉమా సరస్వతి.
9866366457

### హరివిల్లు

మూతికి కట్టు గుడ్డ
మరువకు నీవు బిడ్డ
మంచిది ఎంత చెడ్డ
కరోనా రక్కసి గడ్డ.

మంచికి వేయి బాట
తప్పు పలకకు నోట
వంచనుండెడి చోట
దేముడు ఉండడంట.

కడలి తల్లి బిడ్డలు
రోడ్డున పడ్డ కూలీలు
వారే శ్రమైక జీవులు
వారేనండి శ్రామికులు.

మంచి మనుగడకు
వంచన నీవు ఎంచకు
మంచి మాట పలుకు
నిన్ను నిలబెట్టు తుదకు.

మంచి కోసం నీవు
చేయకు తప్పులు
వంచన చేసి చేయకు
ఊరంతా అప్పులు.

పరులకు చేయి సాయం
అదియును నీకు మంచిది
మనసుకు చేయకు గాయం
అది నీకు కాదు మంచిది.

కష్టంలో దైవాన్ని నమ్ము
అది నీకుయిచ్చు తోడు
ఆశను చేయకు వమ్ము
అది నీకు తెచ్చు కీడు.

మంచికి చేయు ప్రయత్నం
అది నీకు ఫల ప్రదం
చెడుకు చేయు ప్రయత్నం
కాదు నీకు జయ ప్రదం.

మంచికి ఉండు కష్టం
మనిషికి ఉండు నష్టం
చెడు ఎప్పుడు బలిష్ఠం
కాదుగ అది పటిష్ఠం.

మంచికి వేయాలి పీట
మనిషికి అది పూలతోట
అది చూపు నీకు బాట
ప్రగతికది సిరుల కోట.

మంచిని కోరిన మంచిది
వంచన వీడిన మంచిది
ప్రేమను పంచిన మంచిది
తప్పును వీడిన మంచిది.

కడుపు చూసి పెట్టును
గుండెల్లో ఉంచును
తరచి తరచి పెట్టును
ప్రేమంతా పంచును.

పుడమితల్లికి వందనం
కన్న తల్లికి వందనం
నమస్కారాలచందనం
బ్రతుకయ్యేను నందనం.

మంచికి నేడు అంకితం
వంచన నేడు పరహితం
మానవ జన్మ సుకృతం
పాళి భాష ప్రాకృతం.

మనిషికి మనసుఉండాలి
వయసుకు వేడి ఉండాలి
సొగసుకు తపనుండాలి
మనిషికి భక్తి ఉండాలి.

– శైలజా శ్రీనివాస్
8019736254

### పచ్చని పంటలై.. భరతమాతకు హారాలై...

జలధరములన్నీ ఒక్కదెగ్గరకు చేరుకొని
ముద్దుముద్దుగా ముచ్చట పెడుతున్నట్లు...
నా మనసంత సంబరపడుతున్నట్లు...
నిశీధి మొత్తం నల్లని దుప్పటికప్పుకొని
పృధివిని అంతా పరుచుకొని
ఆహ్లాదభరితమైన ఆనందం గోచరిస్తుంది.
చినుకులన్ని సాదరంగా భూమాత ఎదను
తాకుతుంటే...
కర్షకుడు తన కరము తో అలిగిన విత్తులన్నీ....
మొలకెత్తడానికి ఎగసెగసి పడుతుంటే..
నల్లని మట్టిముద్దలని చీల్చుకొని
లేలేత మొక్కలై, రెక్కలు విప్పుకొని
భానుడి కిరణాలు తాకంగా,
మొక్కలై మొలకెత్తి ,అందమైన పుష్పాలు
విరబూస్తుంటే..రంగురంగుల సీతాకోకచిలుకలు
తుమ్మెదల ఝున్కాకార నాదాలతో
వాగులు వంకలు ,కొండలు కోనలు
నీటిదారలు ఆకాశమంత ఎత్తునుండి
జాలువారుతుంటే....జలమంత గలగలా
పారుతుంటే ,బంగారు పంటలు పండుతుంటే
హాలికుడు హృదయములో ఆనందసవ్వడి...
పసిడి దాన్యపు రాసులతో గృహమంత
వెన్నెలవెలుగులతో వెలిగిపోతుంటే...
రైతుమోములో నవ్వుల జల్లులు..
భరత మాత మెడలో పచ్చని
పంటల హారాలు.



–అశోక్ గొనే
9441317361

### మొక్క నాటుదాం

నాటుదాం మొక్క నాటుదాం
వీధి వీధినా నాటుదాం
పల్లె పల్లెనా నాటుదాం
అటుపక్క ఇటుపక్క ఎటుపక్క జూసినా
పచ్చదనాన్నె పరుచుదాం
ఆకుపచ్చదనాన్నె పరుచుదాం //నాటుదాం//

నాటిన మొక్కను ప్రేమిద్దాం
పసిబిడ్డోలె సాదుకుందాం
రోజూ నీటితొ తడుపుదాం
చుట్టూ రక్షణ కల్పిద్దాం //నాటుదాం//

మొక్కను ప్రేమగ పెంచుకుందాం
కంటికి రెప్పోలె కాపాడుకుందం
అడవితల్లిగా మలుచుకుందాం
కరువైన వానను పిలుచుకుందాం //నాటుదాం//

ప్రతి ఇంటిలో ఓ చెట్టు వుండాలి
పండ్లు ఫలాలతో వుండి పోవాలి
పిల్లపాపల కడుపు నిండి పోవాలి
ఇల్లాలి మనసు మురిసి పోవాలి //నాటుదాం//

బాటకిరువైపుల చెట్లు వుండాలి
బతుకుపోరుకి నీడనివ్వాలి
అలసిన వారికి నిద్రనివ్వాలి
ప్రాణశక్తినింపె గాలినివ్వాలి //నాటుదాం//

నాటుదాం మొక్క నాటుదాం
వీధిని వనంగా మార్చుదాం
పల్లెకు అడవిని జోడిద్దాం
ఆకుపచ్చదనం నింపేద్దాం //నాటుదాం//
(హరితహారం సందర్భంగా....)

– అశోక్ గుంటుక
సెల్ నం. 9908144099

### కుట్రావతారం

కుట్రంటే ...
శారీరకంగానో మానసికంగానో
భవిష్యత్తుపైనో కీర్తిప్రతిష్టలపైనో
సంపదపైనో సంతానంపైనో
ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని
ప్రత్యర్థులపై దాడిచేయడమే !

విచక్షణకు విజ్ఞతకు
ఇసుమంతైనా చోటుండదు
కరుణకు కమనీయతకు
కనీస స్థలముండదు !

అయితే....
కుట్రలన్నీ ఒకేరకంగా ఉండవు

బలహీనతల ఆసరాగానో
నిరాయుధుల క్షేత్రం గానో
ద్రోహపూర్వక ఎత్తులుగానో
నేరపూరిత జిత్తులాగానో
గుర్తించగలిగే దర్పణంగానే
కొన్ని కుట్రలుంటాయి !

తేనెపూసిన కత్తులగానో
తీపిమాటల గమ్మత్తుగానో
స్నేహపూర్వక ముసుగు గానో
ప్రేమపూరిత లొసుగుగానో
గ్రహించలేనంత నమ్మకంగా
మరికొన్ని కుట్రలుంటాయి !

కుట్రలకు
ప్రణాళికా రచన
వ్యూహపన్నాగం
అంత సులువేం కాదు!
మేథస్సును మించిన తెలివి
స్పృహను మించిన మెలకువ
అనివార్యం !

కుట్ర భగ్నమైతే
స్వీయ మూల్యం తప్పనిసరి
కుట్ర విఫలమైతే
ప్రత్యర్థి బరిలోనే ఉరి !

కుట్రలకు కారణాలేమైనా
రూపాలెన్నైనా
లక్ష్యమొక్కటే !

అంతం చెయ్యడం
పంతం నెగ్గించుకోవడం
పగ చల్లార్చుకోవడం !

కుట్రల పర్యవసానం ?
రాక్షసానందం
మానవత్వ విధ్వంసం
మనిషితనం మృగ్యమవ్వడం !

–పి. లక్ష్మణ్ రావ్
9441215989



### కొత్తగా ! సరికొత్తగా !!

అక్కడ చూడు
గువ్వలు ఎంతల్లరి చేస్తున్నాయో
చెంగుచెంగున దూకుతూ చూడముచ్చటగా

ఆ మల్లెపువ్వులు చూడు
చిరుగాలికి తలలాడిస్తూ
ఎలా చిరునవ్వులు చిందిస్తున్నాయో ఎంత హాయిగా

కోయిలమ్మ తీపిరాగాలతో
ఎంత వినసొంపుగా కూజితం చేస్తుందో చూడు
మామిడి కొమ్మలపై లేచివుళ్ళు మేస్తూ

పావురాళ్ళు
గుములు గుములుగా
ఎంత స్వేచ్ఛగా ఎగురుతున్నాయో చూడు

మండే ఎండని తరిమేసి
ముసురు పట్టిన మబ్బులను చూడు
వాతావరణాన్ని ఎంత ఆహ్లాదంగా చల్లగా మార్చిందో

చైత్రమాస వసంతం
వైశాఖ గ్రీష్మంలో పులకలు వేస్తున్నట్టుగా
మనసంతా దిగంతాలు తాకినట్టుగా

అపుడపుడే జ్ఞానమొస్తున్న పసిబాలలు
కేరింతలు కొట్టినట్టుగా

కొత్తగా సరికొత్తగా
నవ వసంతం విరిసినట్టుగా



–నాగముని. యం
9490856185

### ఉరికొయ్యపై అక్షరం

అక్షరం మొన్నటి దాకా
అగ్రహారం దాటలేదు

నిన్న అగ్రహారం దాటి
అన్నివీధుల్లోకి వచ్చింది

నేడు ఆకాశమార్గం
పట్టిస్తున్నారు

పొయ్యికిందికి వుంటే
పొయ్యిమీదికి లేని
పిల్లలు అక్షరం అందుకునేదెట్లా

క్రిమి వచ్చింది
చిన్నాచితకా పనులు అటకెక్కినయ్
అరకొర ఆదాయం భస్మం
చదువు చరవాణిలో వీక్షించేదెలా

ఏమి సెప్పితిరి
సాంకేతిక విప్లవమా
కూడూ గూడూ గుడ్డ లేక సస్తుంటే
చూడలేని కబోది
సామాజికార్థిక విప్లవం కి దారి ముందు

ఊరూరా సెల్ టవర్లు
అంతరిస్తున్న చిన్ని పక్షులు
ఇంటింటా చరవాణులు
క్షీణిస్తున్న సామాజిక సంబంధాలు
అక్షరానికి చరవాణికి లంకె
దండుకుంటున్న విద్యావ్యాపారులు

శానిటైజ్ జేసి
మాస్కులిచ్చి బళ్ళు తెరవక
ఆన్లైన్ పాఠాల పరుగులో
పరుగెత్తలేని బతుకులకి
అక్షరాన్ని దూరం చేస్తున్న రాజ్యం
చేతులెత్తేసి
ప్రజారోగ్యం పట్టక
బలాదూర్‌గా రాజ్యం!



– గిరిప్రసాద్ చెలమల్లు
9493388201

### జలమే జీవనాధారం

సమస్త జీవజాతి మనుగడకు
జలమే ఆధారం..!

నాగరికతలన్నీ గంగమ్మ
చెంతనే విలసిల్లలేదా..!

అసలు జలమే లేకుంటే
జీవం పుట్టుక ఉంటుందా..!

జలమే లేని మానవ
జీవనాన్ని ఊహించగలమా..!

నీటి వినియోగాన్ని తగ్గించి
నీటి వృథాని అరికట్టలేమా..!

విరివిగా మొక్కలు నాటుతూ
నీటి నిల్వ సామర్థ్యం పెంచగలమా..!

వాన నీటిని ఒడిసిపడుతూ
భూమిలోకి ఇంకేలా చేయగలమా..!
భావితరాలకి నీటిని
నిల్వ చేసి అందించగలమా..!

గుక్కెడు మంచినీళ్ళ కోసమే
మైళ్ళ దూరం పయనించాల్సిందేనా..!

కలం పట్టే చేతులతో
సమాజంలో చైతన్యం నింపలేమా
జలమే జీవనాధారమని చాటి
చెప్పలేమా..!

–కంది.సత్యనారాయణ మూర్తి
9030277529

### అశృతర్పణం"

నాన్నా నీవేలే త్యాగానికి ప్రతిరూపం
నాన్నా నీవేమా ఈ ఉన్నతి తార్కాణం
ఏమి చేసినా గాని తీరిపోదు నీ ఋణం
ఈయగలము మనసారా మా అశ్రుతర్పణం

అనురాగ మూర్తియైన అమ్మను నా కిచ్చేసి
ఆనందలోకమైన అమ్మఒడిలో నను వేసి
కాలుకంది పోకుండా భుజాన నను మోసి
అందమైన బాల్యాన్ని అందజేసావు వెలసి

దొంగబుక్కలెన్నెన్నో కుడిపించావు
అంగలేయ వేలుపట్టి నడిపించావు
కంటి చూపుతోనే క్రమశిక్షణ నేర్పావు
మౌనదీక్షతోనే నిరసన ప్రకటించావు

మా పోషణె ధ్యేయంగా బ్రతుకు ధార పోసావు
రేయిపవలు మాకోసం నీరెక్కలు వంచావు
ఎంతకష్టమైనా సరె నవ్వుతు భరియించావు
నీ బిడ్డలమైనందుకు గర్వపడగ పెంచావు
నాన్న అంటె ఇలాగే ఉండాలనిపించావు



–డా॥గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

### పల్లెటూరి బావి

ఎట్లుండే ఎట్లుండేరో
నా పల్లె ఎట్లుండే ఎట్లుండేరో
ఎటుచుసినా కానరాదే
నా పల్లె బావి నీరు
పూర్వపు రోజుల్లో
చిన్నా చితుక పిల్లా జెల్లా
ముసలి ముతుక
అందరూ కలిసి
ఊరు చివరన
పొలాల్లో ఉన్న మంచి నీటి
కమ్మని ఓడ బావి దగ్గర
గడియారపు గంటతో
ఏకమయ్యేవారు
ఎవడి కన్ను పడి
భగ్గు మన్నదో గాని
ఎటు చూసిన
కానరావడం లేదే
మంచి నీటి బొక్కేనలు
ఎటుపయనో
ఉట నీళ్లు తాగి
ఉక్కులాగా ఊరంతా తిరిగేరా
పైసలిచ్చి కొన్న పౌడర్ నీల్లుతాగుతే
బొక్కలు అరుగా బట్టేరా
ఎవరి కన్ను పడి
భగ్గుమన్నయో గాని
గుండెలోని బాధలన్నీ
మంచినీటి బావి దగ్గర
ముచ్చట్లతో మునిగిపోయేరా
సంకలోని మట్టి కుండ నీళ్లు
అమృత బిందువులయ్యేరా
ప్లాస్టిక్ క్యాండ్లో నీళ్లు
ప్రాణానికి హాని అయ్యేరా
ఏమిచ్చి తీర్చునోత
అమ్మ లాంటి పల్లె బావి రుణం
కుండ పైన గుడ్డ పెట్టి
మంచి నీళ్ల చెత్త ఓడిచేరా.

–చెల్పూరి శ్రీకాంత్
8297975713.



### హరితహారం

గోతిని లోతుగా తవ్వాలి
మొక్కను దానిలో పెట్టాలి
మట్టిని నిండుగా పూడ్చాలి
గుండ్రంగా కట్ట కట్టాలి
నీళ్ళు నిండుగా పోయాలి
చుట్టు కంచెను వేయాలి
ప్రతి నిత్యం గమనిస్తుండాలి
మొక్కలు ఇంటి ముందర నాటాలి
వీధుల్లో చైతన్యం తేవాలి
ప్రతి ఒక్కరితో మొక్కలు నాటించాలి
పచ్చని ప్రకృతికి బీజం కావాలి
హరితహారం విజయవంతం చేయాలి

–ఉండ్రాళ్ళ రాజేశం
9966946084



### పుస్తకమై పుట్టాలనుంది

లక్షకిరణాలకాంతిని అక్షరరూపంలో గుమ్మరిస్తూ...
పుంఖానుపుంఖాలుగా అనుభూతులను
పుటలలో నిక్షిప్తపరుస్తూ...

వేదాలమొదలు యుగాలచరితల వరకు..
ఆధ్యాత్మికత నుండి సాంకేతిక పరిజ్ఞానం వరకు..
ఎనలేని విషయసంపద యదనిండా నింపుకొని...

వినువీధిలో విహరించే వైజ్ఞానిక సంగతులను..
ఖనిజాలను పొదువుకున్న భూగర్భలోతులను తనువంతా పరచుకొని...

నీతికథలతో గతులను సరిదిద్దే దివ్యభాండాగారమై...
పొడుపుకథలతో మెదడుకు పదునుపెట్టే ప్రహేళికల సారమై..

శూన్యమైన మస్తిష్క గదులలో జ్ఞానరాశులను నింపగా...
గజిబిజి అడుగుల బ్రతుకుకు
గమనం నేర్పే గురువుగా....

ఎడారి జీవితాన సైతం
ఎన్నో చెలిమి చెలిమలను సృష్టించే పుస్తకమై పుట్టాలనుంది...
ప్రతి యదన ఆనందాక్షరవిత్తులను అలకాలని ఉంది...

–స్వప్నకృష్ణ
9440536669



## జవానే....జైహింద్

కన్నవారిని
కట్టుకున్న ఇల్లాల్ని
కడుపున పుట్టిన వారసులని
బంధాలను
రక్తసంబంధాలని
హితులను
స్నేహితుల్నొదిలేసి
గుండెనిండ దేశభక్తిని నింపుకొని
మాతృభూమి రక్షణకై
ఎంతటి పరీక్షనైనా ఎదుర్కొని
నిబ్బరంగా నీ పయనం
వీర జవానులారా మీకివే
మా జోహార్లు

ప్రతి పరిస్థితిని తట్టుకుని
అడుగడుగునా నెట్టుకుని
యద్దరంగంలో వెనకడుగేయని ధీరులారా
నీ తనువులోని అణువణువును సిద్ధం చేసి
రుధిరం దారపోసే
వీరసైనికులారా
మీకిదే మా వందనం

ప్రాణార్పణకైనా వెనకాడని
మీ శౌర్యం
మీ తల్లి మీకు నేర్పిన ధైర్యం
మీలాంటి బిడ్డలను కన్న తల్లి
ఈ దేశానికే గర్వకారణం
బ్రతికినంతకాలం వీరమాతగా
ఆదర్శమౌతుంది
బిన్నత్వంలో ఏకత్వంగల
దేశ ఔన్నత్యానికి
త్యాగరూపుడవు నీవు
మీ త్యాగాలకు
జాతి మొత్తం
మీకర్పిస్తోంది వందనం

-సి.శేఖర్,
9010480557

## జోహార్ వీరుడా!

ప్రాణాలు తృణ ప్రాయమని తలచి
దేశ భక్తిని చాటుతున్న భరత పుత్రులు
సాహసమే ఊపిరి చేసుకుని సాగుతూ
కంటికి రెప్పలా కాపుకాస్తున్న వీర పులులు
రుధిర ధారలతో తడుస్తున్న పుడమి తల్లి
ఆర్తిగా దరికి చేర్చుకుని
తన గర్భంలోనే దాచుకుని తపిస్తుంది బిడ్డల కోసం

ఏ తల్లి కన్న బిడ్డలో తెలియదు కానీ
జన్మ భూమి రుణం తీర్చుకుని ..
జనం కోసం అమరులయి త్యాగాన్ని చూపుతున్నారు

ప్రాణ త్యాగాన్ని వారు చూపితే...
స్మరణ కూడా చేయని దేశ పౌరులు
పనికి రాని వారికి పాలాభిషేకం చేస్తూ
పదరాని పాట్లు పడతారు అజ్ఞానులు

వీర తిలకం దిద్ది కదన రంగానికి పంపిన..
కన్న వాళ్ళు వారి గారాల బిడ్డను
కట్టుకున్న భార్య కన్నుల నిండా నీటితో
కడ దాకా వెంట నడవాలనుకున్నా..
ఆతని కర్తవ్యాన్ని గౌరవించి తనవంతు భక్తిని చాటుకుని
జెండాని చూస్తూ..
జోహార్లు అర్పిస్తూ జై జవాన్ అనే నినాదం చేస్తూనే ఉంది

సైనికా! వందనాలు నీకు!
జన్మ భూమి పై ఎంత మమకారం ఉంటే
చూపించ గలవు ఈ ధైర్యం!
అందరినీ కన్న ఆ తల్లి కోసం
నీవు చూపిన తెగువ మరువము మేమెప్పుడూ
జోహార్ జోహార్ జైహింద్



-లక్ష్మి మదన్
9959186838



## సజీవ ఆశ

ఆ చూపుల్లో
కొలువైన
తరగని విశ్వాసం
ఆ కన్నులలో మెరిసే
ఆశల ఆకాశం

నారు పోసినప్పటి నుండీ
ఒకటే ఆరాటం
చేను,చెలకలంటేనే
అనురాగం

అందరి ఆకలి తీర్చాలనే
అతని తపనకు
తోడురాని కాలమూ..
ఓటు త్రాసులోని లెక్కలతో
మాయలు చేసే రాజ్యము!

వాగ్దానాల జడివాన
ఉపమానాల గానా బజానా
మాటల కోటల్లో రాజును చేసి
పెదాల పదాలలో తేనెలు పూసి
రాజాధిరాజు రైతేనంటూ
గారడీలెన్నో..

తరాలుగా దగా పడుతున్నా
కాలం శూలమై హింసిస్తున్నా
మట్టిని నమ్మిన అతనికి
నాగలే నేస్తం..
కృషియే అతని నిత్యం స్తోత్రం
కాలే కడుపుకు తిండి పెట్టే
ఆత్మీయ మంత్రం

అన్నం పరః బ్రహ్మ మట
రైతన్నే విష్ణు మూర్తియట
నక్కలు సిగ్గు పడేలా
జిత్తుల మాటలు

వ్యాపార వర్గాలకే
తొత్తులైన నాయకులు
వ్యవసాయానికి సాయం చేయాలంటే
రావు వారికి చేతులు

కోట్లు దోపిడీ చేసే దొంగ మల్లన్నలకు
ఎన్నెన్నో వత్తాసులు
దేశానికి ప్రాణమైన అన్నదాతకేమో
నోటీసులు

స్వాతంత్ర్యం సాధించి
సాధించినదేమున్నది!
ఏ చిక్కులు తెలియని
రైతన్నకు రెక్కల కష్టం
కాక ఏమున్నది

పదవులూ,ప్రాకులాటలూ
నటనలూ,నయవంచనలూ
రాబందుల అకృత్యాలకు
తప్పదులే పెను గాలుల తాకిడి

మట్టిని ప్రేమించే గుణమే
కృషీవలుడికి సంపద
మెతుకు మెతుకుకు
అన్నదాత కరిగినా
దేశానికి వెన్నెముకే సదా!

శ్రమ దోపిడి లో సిద్ధహస్తుల
మనసెప్పుడైనా కరిగేనా!
మట్టిని నమ్మిన ఆశలు
సజీవమైతేనే
మన కడుపు నిండును కదా!



-వెల్మల జయపాల్ రెడ్డి
9441168976

## కల్నల్ సంతోష్ బాబుకు నివాళి

(తే.గీ.)కరొన కనిపెట్టి లోకాన కంటకయ్యి
నరుల దృష్టిని మరలింప ఎరలువేసి
వాస్తవాధీన రేఖను వరుసబెట్టి
చెరిపివేయనుజూడగా చీనజూడ!

భరతదేశంబు పిలుపును బాధ్యతగను
అందుకొనియును ముందుకు అడుగులేయ
వీరతెలగాణ సింగంబు ధీరపుత్ర
బాబు సంతోషు పోరాటబాట జూపె!

మంచు కొండలమాటున పొంచిఉన్న
వంచకులతోడనెంతయో వైరమొంది
సూటిమరణంబుకెదురేగ సూర్యపేట
పట్టణంబంతకదిలొచ్చె ప్రణతులిడగ!

చిన్నవయసులో రోషంబుఉన్ననీవు
చూపినావయ్య ఎనలేనిశూరగుణము
దేశయువతకు నీవిచ్చు దేశభక్తి
తరము తరముల తరగని పరమశక్తి!

నీదు త్యాగము నిలుచును నిజముగాను
తప్పకుండగ డ్రాగను తలను వంచి
భరతదేశంబు పాడును చరమగీతి
అదియె మేమంత వెలిగించు అసలు జ్యోతి!



-పెసరు లింగారెడ్డి
9010292500



## సైనిక మొగ్గలు

కోరుకొండ సైనిక పాఠశాలలో విద్యనభ్యసించి
భరతమాత రక్షణకై కంకణ బద్ధుడయ్యాడు
శత్రు దాడిలో వీరమరణం పొందిన సంతోష్ బాబు

అమరవీరుల నిరంతర పహారా వలననే
భరతజాతి నిబ్బరంగా నిద్రించగలుగుతుంది
పుడమితల్లి ఋణం తీర్చే ముద్దుబిడ్డలు

పేగుబంధాలకు అల్లంతదూరంలో ఉంటూనే
భరత మాత సేవకు అంకితమవుతారు
బంధాలుమరచి బాధ్యతలో లీనమయ్యే సైనికులుల

కదనరంగంలోన ఉగ్రనరసింహరూపులవుతూనే
శత్రుమూకలను చీల్చిచెండాడే మహా వీరులు
ప్రాణాలను తృణంగా భావించే పుణ్యచరితులు

ఎప్పుడు ఏమౌతుందో తెలియని సందిగ్ధస్థితిలో
అనునిత్యం ప్రమాదం అంచున ధీరులై నిలుస్తారు
సైనికుల గుండె ధైర్యానికీ వేనవేల వందనాలు

మేము స్వేచ్ఛగా సుఖసంతోషాలతో వుంటే
నీవేమో దేశ రక్షణకై నీ తుది శ్వాసనే విడిచావు
పొంచివున్న మరణానికి వెరువని ధీరుడా వందనం

ఉగ్రదాడిలో ఊహించని ఘటనతో ఆత్మీయులకు
దూరమై నింగికెగసి ధృవతారవయ్యావు
అమరవీరుడా ఏమిచ్చి తీర్చుకోగలం మీ ఋణం

మా అందరి బంధువై మాకు రక్షణ కవచమై నిలిచి
మా ఆనందాలకు ఆలంబన వయ్యావు
అసువులు బాసిన వీరుడా వందనం

అనుబంధాలకు విలువివ్వని సమాజ గమనంలో
భరతజాతి కోసం ప్రాణాలను పణంగా పెడతారు
సైనిక వీరుల మహోన్నత వ్యక్తిత్వానికి జోహార్లు



- పులి జమున
8500169682

## జైజవాన్లకెల్ల జైయనంగ

అమరవీరులసేవఅజరామరమనెంచి
దేశబద్రతచేయుదీక్షతోడ
సరిహద్దురక్షించుసైనికులుగజేరు
మనజవాన్లతెగువమరవలేము
దొంగదెబ్బతొచైనదూకుడుకుట్రలు
భారతబలగాలబద్రతలతొ
అప్రమత్తతతోడఅరివీరవీరులై
వీరజవాన్లంతపోరుసల్ప

కదముదొక్కిచనుచుకల్నలుసంతోష
వీరమరణమందెధీరుడౌచు
సూర్యపేటబిడ్డసూర్యుడైవెల్గెను
తెలుగువారిఘనతతేజరిల్ల

ఉన్నఊరువిడిచికన్నవారినొదలి
బార్యపిల్లలన్న బందమొదలి
ఎండవానచలికిఎదురొడ్డిపోరాడు
జైజవాన్లకంతజైయనంగ

మీదుత్యాగఫలముఏమనివర్ణింతు
దేశమాతరుణముదీర్చుకొనుచు
చీనఎత్తుగడలుచిత్తుచిత్తుగజేసి
విజయపథముగొనుడువీరులార

-తుడిమిళ్ళ భీష్మాచారి
9392442755

## అమరులకు అభివందనం

మాతృ దీవెనలతో
దేశమాత రక్షణలో
సాహసమే ఊపిరిగా
ఆలిబిడ్డలకు దూరంగా
దేశభక్తిని వంటికి కప్పుకుని
కాస్తున్న వీరులకు వందనం!!

రేయనక పగలనక
కంటికి కునుకులేక
దేశ సరిహద్దు ప్రాంతంలో
పహరా కాస్తున్న
వీర సైనిక సోదరులారా
నిస్వార్థ దీక్షా తంత్రులారా

సేవా తత్పరులారా
వందనం అభివందనం!!

చైనా నుండి వచ్చి ప్రపంచాన్ని
గడగడలాడిస్తున్న మహమ్మారి
ఒకవైపు
కవ్వింపు చర్యలతో
సైనికులపై దాడి చేస్తూ
ప్రాణాలు తీస్తున్న చైనా దొంగలు!!

గడ్డకట్టే మంచులో
లద్ధాక్ లోయలో
నెలకొన్న భీకర వాతావరణం
వేడి వాడి పోరుమంటలు
ఎగిసిన ఆగ్రహజ్వాలలు!!
అణుబాంబులేక ఆయుధాలు లేక
పోరుసల్పిన వీర సైనికులు
దేశరక్షణలో సంతోషంగా
అసువులర్పించిన కల్నల్

బిక్కుమళ్ళ వంశాంకురం
దేశ నుదుటను వీరతిలకం
దిద్దిన వీరులకు అశ్రునివాళి
ఏమిచ్చిన తీరనిది మీ రుణం
అందుకోండి మా వందనాలు!!



-డా.చీదెళ్ల సీతాలక్ష్మి
9490367383

## ఆకలి కేకలు

అనగనగా ఆకలి పుట్టి
మనిషితో ఆడుకుంటుంది

సవాలు విసురుతూ
నన్ను జయించమంటూ,
పిడికెడు బువ్వకై
మాటలు నేర్చిన మనిషి
బువ్వతో ఆగక

ఆకలి పెరిగి ఎంత తిన్నా
ఆకలి చావక
దునియా మొత్తం దున్నేయాలని
ఆశ అత్యాశ కాగా
పుట్టిమీద బువ్వ
చూరెక్కి కూర్చుని

పేదవానికి అందక
ఉన్నవాడికి అరగక
ఆటలాడుతోంది..త
గెలుపుకోసం మనిషి
అడ్డదారులు తొక్కి
తన ప్రయాణం ఎందుకు
మొదలుపెట్టాడో మరచి
దిక్కులేని దిక్కులో

కరోనా కాలంలో
కానరాని బ్రతుకు
కలవరపడి పోరాటం చేస్తోంది...



-పి.విశాలాక్షి
9908435805

## మనిషికి దూరంగా

మూతికి గుడ్డ మంచిదే
మరీ మనసు కప్పేంత కాదు

కళ్ళకు భయం మంచిదే
అనుమానపు కళ్ళజోడు
తగిలించుకునేంత కాదు

దూరం పెట్టడం మంచిదే
బంధాలను గుర్తించ లేనంత
బహు దూరంగా కాదు

పుట్టిన గడ్డే ప్రాణంగా
ఒకే గాలిని పీల్చి బ్రతికాం
ఊహించని శత్రువు
తరుముతుంటే
ఒంటరి అడుగులేస్తున్నాం

ప్రతి ఉదయాన్ని
పరీక్షగా గమనిస్తే
జబ్బుపడ్డ పచ్చదనంలో
రాలిపోయే ఆకుల స్వరం
అంతకంతకూ పెంచుకుంటుంది

జీవితాలలో కొత్తకోణం
ఇప్పుడు వెలుగుజూస్తుంది
మనిషికి దూరంగా
మార్పేదో పరుగు తీస్తుంది.

-నల్లు. రమేష్
9989765095

## "మనిషి" ఓ వింత

ఇప్పుడు లోకమంతా కిక్కిరిసిన విశ్రాంతి .
జీవితాలను వీడి "పని" పారిపోయింది.

రేయంబవళ్లు సోమరితనంతో
భవిష్యత్తు ఊపిరాడక
బతుకులో ఉక్కపోత.

యోగులు ఎప్పోడో చెప్పినా
మేధావులు ఇప్పుడు విప్పినా
అర్థంకాని రహస్యం
ప్రపంచంలో "మనిషి" ఓ వింతలా.

ఆకాశాన్ని ఏలే పక్షి
అడివిని పాలించే జంతువు
సముద్రాల్లో సాగే జీవులు
అందంగా పుట్టి ఆనందంగా గడిపిన
ప్రకృతి స్నేహ స్వరూపాలే.

కానీ...
మనిషివన్నీ క్రూరపాత్రలే.
ఫలితాలన్ని వైపరిత్యాలే.
ఓ సునామిలా.....
ఓ కంపనంలా......
ఓ కరోనాలా.....
ఓ కరువు రక్కసిలా.....
ప్రకృతి చరిత్ర నిండా
మనిషి విషఛాయలే.



-చందలూరి నారాయణరావు
9704437247

## నడక నడక నడక...

సంకలో బిడ్డ -
వీపున మూట
నడినెత్తిన ఎండ
కాళ్ళ కింద మంట
వందల మైళ్ళ నడక
దేహం నుంచి చెమట చుక్కల ధారలు
ముక్కు పుటాలనుంచి నిట్టూర్పుల సెగలు
అన్నం కోసం పేగుల అరుపులు
నీళ్ళు ఇంకిన కళ్ళతో
నడక నడక నడక
నిండు నెలల గర్భిణీ..
డొంకల్లో నిస్సహాయ పురుడుబి
పురిటి బిడ్డని పొదివి పట్టి
ఖాళీ కడుపుతో ..
నడక నడక నడక
పోలీసు స్టేషన్ లో దరఖాస్తులు
దక్కని రైలు పాసులు
దక్కిన లాఠీ ఛార్జీలతో
నడక నడక నడక..
ఉన్నచోట ఉంటే ఆకలి చావు
నలుగురితో కలిస్తే కరోనా చావు
ఉన్న ఊరినీ అయిన వారినీ వదలి
పిడికెడు గింజల కోసం
పక్షుల్లా ఎగిరి వచ్చిన
వలస కూలీల గోడు
చేరాలి సొంత గూడు
చావైనా బతుకైనా
అయినవారి మధ్య ఉంటే చాలుబి



-డా.కేతవరపు రాజ్యశ్రీ
8500121990

## నేర్చుకుందాం-నేర్పిద్దాం

అది కరోనా కావొచ్చు
లేక మలేరియా కావొచ్చు
డెంగు జ్వరమే అవ్వొచ్చు
ఎయిడ్స్ రోగమే అవ్వొచ్చు,

బాధలు పడే వాళ్ళు
బాధలు పుట్టించే వాళ్ళు
బలిచేసేవాళ్ళు
బలయి పోయే వాళ్ళు
మనలోంచే ఉంటారు

ఎవడెక్కపోతే మనకేంటి
ఎవరేం చేసుకుంటే మనకెందుకని
తలుపులు గట్టిగా మూసుకుంటే
మనం బతికి పోయే అవాకాశాలు లేనే లేవు

కరోనా వైరస్ పుట్టిందెక్కడ?
కరోనా వైరస్ తెచ్చిందెవరు?
కరోనా వైరస్ అంటిస్తున్నదెవరు?
కరోనా వ్యాప్తికి కారకులెవరు?

పుట్టిందెక్కడయినా
తెచ్చిందెవరయినా
అంటిస్తున్నదెవరయినా
వ్యాప్తి చేస్తున్నదెవరైనా

బలిఅవుతున్నది మాత్రం
నువ్వు నేను నీ కుటుంబం నా కుటుంబం.

లోతుగా ఆలోచించండి
మనము మాత్రమే జాగ్రత్తగా
బాధ్యతగా ఉంటె సరిపోతుందా
మనతో పాటు కలిసి జీవించే వాళ్ళు
మనలను పాలిస్తున్న పార్టీలు
మన చుట్టు పక్కల ఉండేవాళ్ళు
అందరు కనీస బాధ్యతలు పాటించకపోతే
ఒకరి తప్పుకు అందరం బలిఅవ్వాల్సిందే కదా!

దేశం రాష్ట్రం బాగుండాలన్నా
కనీసం మన బతుకులు బతకాలన్నా
కనీస బాధ్యతలు తెలుసుకోవాలి
కనీస బాధ్యతలు పాటించాలి,

కేవలం హక్కులు
కేవలం ఉచితాలు
మన తలరాతలు మార్చలేవు
బాధ్యతలను పాటిస్తూ
ప్రశ్నిస్తూ పయణిస్తేనే
దేశాన్ని రాష్ట్రాన్ని మార్చుకోవడం
వీలవుతుంది,

విమర్శిస్తూ బతికేయడంలో
కిక్కున్నట్టు అనిపిస్తున్నా

బాధ్యతా రాహిత్యం నీతో పాటు
నువ్వుండే సమాజాన్ని కూడా
బలితీసుకుంటుంది,

హక్కుకు ముందు భాద్యత
ప్రశ్నించడానికి ముందు పాటించడం
ఉంటాయని తెలుసుకుని నడిస్తే
అది కరోనా అయినా
సరిహద్దు దేశంతో యుద్ధమయినా
విజయం మనదే

-రఘోత్తం రెడ్డి పిన్నింటి
01 -859 -536 -8746
మేరీల్యాండ్

## సరైన శిక్ష !

ఎంతపని చేసావు ఓ చైనా!
లోకం మీదికి విసిరావు కరోనా!
అది లక్షల్లో చంపింది జనాన్ని!
తీరని శోకంలో ముంచింది లోకాన్ని!

పెద్దతప్పే చేసి తప్పించుకున్నావు!
ముప్పువుందని తెలిసి కప్పిపుచ్చావు!
వాయుమార్గంలోన వ్యాధి పంపించావు!
నంగనాచిలాగా నసుగుతున్నావు!

నువ్వే చేసావు ఈ ఘోర నేరం!
మాకు శిక్షపడుట ఎంత ఘోరం!
ఎవరిస్తారు మాకు పరిహారం!
ఈ సమస్యకు ఏది పరిష్కారం!

లాక్‌డవును పెట్టినా, జాగ్రత్తగా వున్నా
అల్లుకుపోతోంది అంతులేని కరోనా!
అయిననూ అది అదుపులోనే వుందని సభ్యదేశాలన్నీ
మెచ్చాయి భారత్‌ని!
ఓర్వలేని నువ్వు సరిహద్దులో చేరి
దొంగచాటుగా మా వీరులను చంపావు!
ధీటుగా నిను మేము తిప్పి కొట్టాము!
సిగ్గుతోటి నువ్వు తోకముడిచావు!

ప్రపంచ దేశాలు మిమ్ము ఛీ కొట్టాయి!
మీ వస్తువులను బహిష్కరిస్తున్నాయి!
ఇదియే "సరైన శిక్ష " నీకు చైనా!
జాగ్రత్తగా మసలుకో భవితలో ఇకనైనా!
-నోరి రఘురామమూర్తి,

## దండు దండయాత్రలు

కరోనా పీడకల చెదరనేలేదు
వలస దుఃఖాలకు లేపనాలద్దనే లేదు
కరోనాతో కుదేలైన ఆరోగ్యఆర్థికాలు
కుదిపేసిన అంపన్ తుఫానులు
సమస్యల అగ్నికి ఆజ్యం పోసినట్లు
గోరుచుట్టుపై రోకలి పోటులా
పులి మీద పుట్రలా
గాలివాటమే ఊతంగా
గడగడలాడిస్తూ స్వైర విహారాలు
పిశాచ మిడతల దురాక్రమణ పరుగులు !

ఎనలేని రీతిన ఎడారి మిడతలు
అన్నదాత రైతన్ననే కాదు
పంటలు, పచ్చదనాలను కూడా
భక్షించ దేశాంతర వలసలు
పంటలపై పురుగుల వస్త్రం కప్పినట్టు
ఆకు, పువ్వు, కాయ, పండు ఫలాల్ని
చేతికందేలోపే చెరిపేసే పాడు పురుగులు
దేశ ఆహార భద్రతకే పెను ముప్పులు
కొమ్ములు తిరిగిన హరిత వినాశక క్రిములు
ఆహారాన్ని ఆరగిస్తూ శరవేగ యాత్రలు !

అనర్థాలన్నీ మానవాళి స్వయంకృతమని
చేతులు కాలక ముందే ఆకులు పట్టుకొని..
సరిహద్దుల్లోనే సంకెళ్ళు వేస్తూ
పటిష్ట సురక్షిత పథక యుద్ధ రచనలు
సంహారానికి బహుముఖీన సైనిక వ్యూహాలు
విధ్వంసక కీటకాలకు కళ్లెం వేస్తూ
భీకర శబ్దాలు, ఫైరింజన్ పిచికారీలు
దేశ వెన్నెముకకు దన్నుగా నిలిచి
రైతేరాజంటూ దండుపై దండయాత్ర చేస్తూ
రేపటి అక్షయపాత్ర భారతానికి పునాదులేద్దాం !



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## పట్టాలపై పాదయాత్ర

కరోనా...?
ఎంతటి దౌర్భాగ్య స్థితి తెచ్చావే ?
పొట్టకూటి కోసం
వలస కూలీలుగా వచ్చినవారు
బతక లేక
మూటముల్లే సదురుకోని
సంకలల్ల బిడ్డల్ని ఎత్తుకొని
సక్కగా రైలు పట్టాలెంబడి
పాదయాత్ర చేసుకుంటూ
వాళ్ళ రాష్ట్రాలకు బోతుండ్లు !

కలో గంజో తాగి
ఈడనే వుందా మనుకుంటే
కరోనా గజ్జున వణికిస్తుండే..
కరుణించే జాడలు లేక
ఆకలికి తట్టుకో లేక
ఉన్నఊరే ఉత్తమమని
నడకను నమ్ముకోబట్టే !

నడక సాగితే మంచిదే
కానీ..!
ఓ పక్క మూటలు
మరో పక్క
అల్లరిచేసే తూటలు
గంటెత్తు కుంటనే
గుంజిసత్తది చేయి
ఇప్పుడు...
ఎన్ని గంటలైతాందో మోయబట్టి !

కరోనా...ఉన్నకాడుండక
చైనా నుంచి ఉరికి వత్తివి
వచ్చిందానివి ఓ మూలనుండక
లోకాన్ని చుట్టేస్తివి
అంతటితో ఆగితివా..?
పాణాలు తీసుకుంట
పరిహాస మాడుతాంటివి !

ఇంకెన్ని రోజులు
నీ ఆటలు కరోనా..?
ఓ మందు , సూదో వచ్చేవరకే
"నవ్విన నాపచేను పండదన్నట్లు "
నిన్ను చంపే టైం దగ్గర్లనే వుంది !!

మా వలస కూలీల
పాదాలకు విశ్రాంతి టైం
అతి దగ్గరలోనే వుంది !!



-తాండ్ర చిరంజీవి
9959180762.

## ఆ బూచికి పట్టివ్వకు

నీకుతెలుసు కదా
కోయిల మనసు పెట్టి
కూయాలని కోరుకునే వాడిని నేను.

వేర్ల చేతులు బిగించి
మట్టి ఉనికిని మధురం చేసే
మహా తరువుకు నిత్యం
పాదాభివందనం చేసేవాడిని.

పశువునైనా పక్షినైనా
ప్రేమపాశంతో అల్లుకుని
ఒకరికొకరమై జీవించాలని
పదే పదే పూజలు చేసే వాడిని.

అంతులేని ప్రశ్నలు సంధించే ఆకాశంలో
సమాధాన చినుకునై వర్షించాలని
సదా తపించే వాడిని.

వీనులకు వేణుగానం మోసుకొచ్చే
చల్లని గాలిలో
స్వచ్ఛత కాంక్షించే వాడిని.

అప్పుడప్పుడూ
అల్లరి పనులేవో కొన్ని.

మనిషి తనానికి
అజీర్తి చేసే స్వార్థపు జబ్బు
అతిశయించినపుడల్లా
నీవిచ్చే చేదు మందుతోనే
సాంత్వన పొందే వాడిని.

భూమిని బొమ్మను చేసి
కాంక్రీటు చొక్కా తొడిగి
ప్లాస్టిక్ ఆభరణాలు పెట్టి
పిచ్చి ఆటలు ఆడిన ప్రతీసారి
నీ వేడి చివాట్లతో
వెనక్కు తగ్గే వాడిని.

తప్పటడుగులు సవరించే
నీ దండనలో అర్థముంది
తిట్టినా కొట్టినా
చేరదీసి ముద్ద పెట్టినా
ప్రకృతి అమ్మవు నువ్వే కదా.

తెలిసీ తెలియక
కాలుష్యపు నిప్పుతో చెలగాటమాడితే
చెయ్యి చేసుకోగాని
కరోనా బూచికి మాత్రం పట్టివ్వకు.



-నల్లు. రమేష్
9989765095

## ఎంత కాలము

ఎంత కాలము ఎంత కాలమో...
కరోనా కష్టాలెంత కాలము ఎంత కాలమో....
కనపడని పురుగుతో పోరు చేయుట ఎంత కాలమో...
మన కళ్ళ ముందే మరణశాసనమెంత కాలమో....
బడులు గుడులు బందుపెట్టిరి
చదువు సంధ్యలు మూలనెట్టిరి
రాకపోకలు ఆగిపోయే
రాజ్యమంత అవస్థలాయే
పని పాటలు లేక ప్రజలు
పస్తులుండే రోజులొచ్చే ॥ ఎంత ॥
పొట్ట చేత పట్టుకోని
వలస వచ్చిరి బడుగు జీవులు
కూలీనాలి దొరకదాయే
కడుపు నిండుట కష్టమాయే
బతుకు బండిని లాగలేక
కన్న ఊరికి పయనమైరి ॥ ఎంత ॥
కరుణ లేని కరోనా పురుగు
మందు మాకు లేని పురుగు
విధి రాతను తిరగరాస్తూ
మనుషులను బలి కోరుతున్నది
ఇల్లు దాటి బయటకొస్తే
కసితో కాటు వేస్తానంది ॥ ఎంత ॥
కొలువు చేస్తామంటు పిల్లలు
ఉన్నఊరును వదిలి వెళ్లిరి
దారికాసి ఎదురుచూసే
కన్న వారిని చూడ మనసై
కంట నీరు పెట్టుకుంటూ
కాలమెల్ల దీసుడాయే ॥ఎంత॥
పల్లే పట్నం తేడాలేక
పంజావిసరగా మహమ్మారీ
దారి తెన్ను కాన రాక
కలల సౌధము కూలిపోగా
భయం గుప్పిట బతుకుడాయే
బతుకు దెరువు బండలాయే ॥ఎంత॥



-అల్లి మోహన్ రాజ్
9705207615

# "స్వామి" వారి సేవ

కథ

**"ఇస్కాన్" వారి హరే రామ హరే కృష్ణ మందిరం, జుహూ, ముంబయి. పదవీ విరమణ తర్వాత నేను సేద దీరే చోటు. సంసార బాధ్యతలన్నీ తీర్చింతర్వాత, నాలో నేను చూసుకునే విడిది. అక్కడి భజన బృందం తో పాటు 'హరే రామ హరే కృష్ణ' అంటూ తన్మయత్వంతో లీనమయ్యే స్థావరం.**

అలా ఓ రోజు నేను భజనలో చేస్తుండగా, "వాసూ బాగున్నావా?" నన్ను ఊపుతూ ఓ పలకరింపు. కళ్లు తెరిచి చూస్తే నా సహచరుడు కృష్ణహరి. అతనూ నాలా ఇస్కాన్ లో జీవిత సభ్యుడే. "బావున్నాను హరీ! బహుకాల దర్శనం" అని లేచి, మందిరం వెనుకవైపు ఉన్న కాఫెటేరియా వైపుకు దారి తీసాను.

"ఏముందీ, మా రెండో అబ్బాయి కూతురి పెళ్లికని అహమ్మదాబాద్ వెళ్లి, అక్కడినుంచటే అబూ, ఉదయ్ పూర్, నాథ్ ద్వారా, జైపూర్, పుష్కర్ అలా కొన్ని రోజులు రాజస్థాన్ పర్యటించి వచ్చాము. ఉద్యోగంలో ఉన్నప్పుడు సెలవులు దొరకక పెండింగ్ లో పెట్టిన యాత్రలు, ఇప్పుడు పూర్తి చేస్తున్నాము. ఉద్యోగం నుండి విరమణ పొందాం కాని,జీవితం నుండి కాదు కదా? ఏదో కాళ్లు, చేతులు ఆడినన్ని రోజులు మనల్ని మనం చురుకుగా ఉంచుకోవడంమంచిది. ఔనూ, నీ స్వామివారి సేవ ఎలా జరిగింది?"

"సేవైతే బాగానే జరిగింది కాని, అది ఎవరు ఎవరికి చేశారో చెప్పలేను."

"శ్రీవారి సేవ కని తిరుమల వెళ్లావు కదా? దాంట్లో ఎవరు, ఎవరికి సేవ చేశారో చెప్పలేక పోవడమేంటి?"

కృష్ణహరిలో సందేహం.

"అది చెప్పాలంటే చాట భారతమంత ఔతుంది కానీ పద, మందిరం ప్రక్కనున్న పార్కులో కూచుని తీరిగ్గా కబుర్లు చెప్పుకుందాం." అని పార్కు వైపుకు దారి తీశాను. కృష్ణహరి అనుసరించాడు.

పార్కులో ఓ బెంచీ పై కూర్చున్నాక "ఇప్పుడు చెప్పు, నీ సేవాయణం" హరిలో కుతూహలం.

"మొదటినుంచి చెప్పాలంటే చాలా సమయం పడుతుంది. వినే ఓపిక నీకుందా?" నేను ముందే హెచ్చరించాను.

"పదవీ విరమణ తర్వాత మనకి టైమే టైము. ఇంటికి వెళ్లి చేసే పనేముంది? అయినా మినీ కథలా చెప్పు. మీ

రచయితలకు సహజమైన బుద్ధితో, టీవీలోని జీడిపాకం సీరియళ్లలా సాగదీయకు." కృష్ణహరి నా ముందరి కాళ్లకుబంధం వేశాడు.

" మరీ మినీ కథలా కాదు గానీ, ఓ కథానికలా చెబుతాను సరేనా?" నేనూ తక్కువ తినలేదు.

"నీ లాంటి రచయితకు చిక్కింతర్వాత తప్పుతుందా? అలాగే కానీయండి శ్రీనివాస మహాశయా!" కృష్ణహరిలో అదే

చిలిపిదనంతో కూడిన వెక్కిరింత.

"కర్ణాటకలోని 'హోన్నావర్' లో ఓ పెళ్ళికి హాజరై, పనిలో పనిగా మురుడేశ్వర్, గోకర్ణ, ఊడిపి, ధర్మస్థల్,మంగళూరు, కూర్గ్ అలా ఓ వారం రోజులు పర్యటించి, తిరిగి వచ్చాం, నేనూ మా కుటుంబం. ఆ తర్వాత నాలుగురోజుల్లోనే ప్రపంచ తెలుగు మహాసభలకని హైద్రాబాద్ వెళ్లాల్సి వచ్చింది."

"స్వామివారి సేవ గురించి చెప్పమంటే, నీ ఇతర ప్రయాణాలు ఏకరువు పెట్టి చంపుతావేంటి?"

"కథానికలా చెబుతానని నేను ముందే చెప్పాను. నువు 'సరే' నన్నావు. ఇక భరించాల్సిందే.

అసలు విషయానికి రాక ముందు, కథానికలో 'ఎత్తుగడ' అనేదుంటుంది. ఆ నేపథ్యం లేకపోతే కథ రక్తి కట్టదు. దానిప్రాముఖ్యత, మున్ముందు నీకే తెలుస్తుంది. 'కట్టే, కొట్టే, తెచ్చే' అని చెప్పే రామాయణం సంపూర్ణం కాదు. అలాచెప్పడం నాతో కాదు. నువు వింటానంటే కొనసాగిస్తాను. లేకపోతే మన మన ఇళ్లకు వెళదాం." నేనూ బెట్టు చేశాను.

"నీ సంగతి తెలుసు కానీ, నువ్ కానీయవోయ్" కృష్ణహరి దిగి వచ్చాడు.

"తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సాహిత్య అకాడమీ పుణ్యమా అని ప్రపంచ తెలుగు మహాసభలుదిగ్విజయంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అతిథిగా పంచతారాంకిత హోటల్లో బస, ఏ.సీ. కార్లో స్థానికరవాణా సౌకర్యం, ఆయా సదస్సుల ప్రాంగణాల్లో తెలంగాణ పిండి వంటలైన, సకినాలూ, గారెలూ, మిరపకాయబజ్జీలూ మొదలైన వాటితో విందు భోజనం, మహాసభల ఆ ఐదు రోజులు రాజభోగాలు అనుభవించాను. నేనుపాల్గొన్న 'కథా-నవలా రచయితల సదస్సు' లోని నా ప్రసంగం అదిరిందని శ్రోతల మన్ననలను అందుకున్నాను.అలాగే కవి సమ్మేళనంలో నేను చదివిన 'తెలంగాణ వైభవం' కవితకు మంచి స్పందన వచ్చింది. ఐతే నా తిరుగుప్రయాణంలోని ఓ అపశ్రుతి, నా



-అంబల్ల జనార్దన్
సెల్:09987533225

మూడంతా పాడు చేసింది. నేను శంషాబాద్ విమానాశ్రయం చేరే సరికి నావిమానపు బోర్డింగ్ కౌంటర్ మూసేశారు. పొరపాటున ముంబయి చేరే సమయాన్ని, హైద్రాబాద్ నుండి బయలుదేరే సమయమని అనుకోవడంవల్ల విమానాశ్రయానికి ఆలస్యంగా చేరుకున్నాను. అది నాన్ రిఫండెబుల్ టికెట్ అవడంవల్ల ఆ డబ్బులూ పోయాయి. ఆ తర్వాతి రోజు ప్రొద్దునే సెవా యాత్రకై బయలుదేరాల్సి ఉండడం వల్ల, ఆ రాత్రికిఎలాగైనా ముంబయి చేరుకోవాలి కాబట్టి, మరో టికెట్ కి పదివేల రూపాయలు అదనంగా సమర్పించుకోవాల్సివచ్చింది.

ఆ రోజు రాత్రి పన్నెండు గంటలకి ఇంటికి చేరుకున్న నేను, మర్నాడు పెందలాడే లేచి, ప్రొద్దున తొమ్మిది గంటలకుఛత్రపతి శివాజీ మహారాజ్ టర్మినస్ చేరుకున్నాను. మా 'సప్తగిరి సేవా సమితి' లోని యాభై మందిని కలిసి, పేరుపేరునా వారిని పలకరించగానే నాలో కొత్త శక్తి ప్రవేశించింది. ఎప్పుడూ ఏ.సీ. కోచ్ లో ప్రయాణించే నేను, మా సేవాసమితి సభ్యులతో స్లీపర్ కోచ్ లో కూడా సౌకర్యంగానే అనుభూతి చెందాను. వారితో కలిసి భోంచేయడం, కబుర్లుచెప్పుకోవడం, భజనలో పాల్గొనడం, అదంతా ఓ అపురూప అనుభవం.

మా మొదటి మజిలీ మదురై. అక్కడి హోటల్లో దిగి, స్నానాదులు ముగించి, భోజనాలు చేసే సరికి రాత్రిపదకొండయింది. మర్నాడు ఉదయాన్నే లేచి, కాలకృత్యాలు తీర్చుకొని, మాకై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులోమీనాక్షి అమ్మవారి కోవెలకు చేరుకున్నాం. అమ్మవారికి మొక్కి, ఇంకొన్ని స్థానిక దేవాలయాలు చూసి, ఓ మంచిహోటల్లో భోంచేసి, హోటలు గదికి చేరుకున్నాం.

భుక్తాయసం తీర్చుకొని అవే బస్సుల్లో రామేశ్వరం బయలుదేరాం. రాత్రి హైవే లోని ఓ హోటల్ వద్ద భోజనానికనిఆగాం. మా వాళ్లంతా మీల్స్ కని ఓ హోటల్ కి వెళితే, డయాబిటీస్ వల్ల కేవలం చపాతీలు తినే నేను, వేరేభోజనశాలకు వెళ్లాను. అక్కడ చపాతీ తింటుండగా ముంబయి నుండి ఫోన్ వచ్చింది. మావాళ్లతో మాట్లాడి, భోజనంముగించి, మా బృంద సభ్యులున్న హోటల్ చేరాను. అప్పుడు జేబులో చూసే సరికి నా మొబైల్ లేదు. అది నేను

భోంచేసిన హోటల్ టేబిల్ పైనే ఉండొచ్చని, అక్కడికి పరుగు తీశాను. అక్కడ నేను కూచుని తిన్న టేబిల్ పై ఫోన్లేదు. కౌంటర్లో అడిగితే ఏ ఫోనూ వారికి దొరక లేదన్నారు. ఒక వెయిటర్ మాత్రం, నా పక్కన కూర్చున్న అయ్యప్పస్వామి, టేబిల్ పై నున్న మొబైల్ ని అతని జేబులో పెట్టుకోవడం చూశానన్నాడు. హోటల్ బయటచూస్తే ఇంకెక్కడిఅయ్యప్ప స్వామి? నా ఫోన్ తీసుకొని ఎక్కడికో ఉడాయించాడు. ఓ మిత్రుని ఫోన్ నుండి ఆ రెండు నంబర్లకు ఫోన్చేస్తే స్విచ్ ఆఫ్ అని చిలుక పలుకు. రెండు సర్వీస్ ప్రొవైడర్ లకు, నా ఫోన్ గల్లంతైన సంగతి తెలిపి, ఆ నంబర్లనుబ్లాక్ చేయమని చెప్పాను. లేకపోతే, అవి రెండూ పోస్ట్ పెయిడ్ అవడం వల్ల నా ఫోన్ దొంగ, చేసే కాల్స్ కి కూడానేనే, బిల్ చెల్లించాల్సి ఉంటుంది. నా మనసంతా వికలమైంది. మా వాళ్లు కూడా చాలా బాధ పడ్డారు.అన్యమనస్కంగానే యాత్ర కొనసాగించాను.

రామేశ్వర మందిరంలోని ఇరవైమూడు బావుల్లోని నీటితో స్నానం చేసి, రామేశ్వరుని దర్శనం చేసుకుని, శ్రీరంగంబయలుదేరాం. మర్నాడు శ్రీ రంగనాథుని దర్శనం చేసి, కొన్ని ఇతర మందిరాలు తిరిగి, తిరుచిరాపల్లి నుండి రైల్లోతిరుపతి బయలుదేరాం.

తిరుమలలోని సేవా సదన్ చేరి, మా వివరాల ఫారాలను అక్కడి నిర్వాహకులకు ఇచ్చాం. అంతకుముందే మాబృంద నాయకుడు మా పేర్ల పట్టిక వారికి పంపించినందున, దాని ప్రకారం వారు మా ఫారాలను తనిఖీచేయసాగారు. అరవై ఏళ్లు దాటిన వారు సేవకు పనికిరారట. అందుకని నేను ఊపిరి బిగపట్టి, నా ఫారం ఎప్పుడువస్తుందా అని ఆతృతగా ఎదురు చూడసాగాను. ఏమైతేనేం నా ఫారం వచ్చింది. అనుమానించినట్టుగానే నేను సేవకిపనికిరానని తేల్చారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు, సెలవు దొరుకక, తీరికలేక, స్వామివారి సేవకు నోచుకోలేదు. ఇప్పుడుఅరవై ఏళ్లకు రిటైరయింతర్వాత ఏజ్ బార్ అని, అనర్హు?ణ్ణి చేశారు. అంతకు ముందు సంవత్సరం, అదే గ్రూపుతోవచ్చిన ఇద్దరు సీనియర్ సిటిజన్స్ ని అనుమతించారట. అదే ఆశతో నేను స్వామివారి సేవకై వస్తే, దురదృష్టంవెంటాడింది. నా ఇష్టదైవం సన్నిధిలో భక్తులకు సేవ చేయాలనే నా తాపత్రయానికి గండి పడింది. ఎన్నోకష్టనష్టాలను ఓర్చుకొని, తిరుమల చేరిన నాకు అది తీవ్ర అఘాతం. నా మొహం కళ తప్పింది. మా బృందనాయకుడు, ఇతర సభ్యులు నన్ను సాంత్వన పరిచారు. 'ఎలాగోలా మాతో తీసుకెల్లి సేవలో పాల్గొనేలా చేస్తామని'ఊరడించారు. అన్నట్టుగానే ఒక సేవా స్కార్ఫ్ సంపాదించి నా మెడలో వేశారు. ఐనా నా సేవకు అధికారిక గుర్తింపుదక్క లేదనే దుగ్ధ, నన్ను తొలుస్తూనే ఉంది. అది నా ఆరోగ్యం మీద ప్రభావం చూపింది. నడుస్తే ఆయాసం. మా తోటివారి నడక గతిని అందుకోలేక కూలబడ్డాను. మూడో రోజు పడకేశాను. మా తోటి వారితో సేవకు పోలేకపోయాను.అంతకు నాలుగు సంవత్సరాల క్రితం బైపాస్ సర్జరీ కాక ముందటి వ్యాధి లక్షణాలు పొడచూపసాగాయి. ఆ రోజువైకుంఠ ఏకాదశి. అంత రద్దీలో స్వామి వారి దర్శనానికి వెళ్లే ధైర్యం చేయలేకపోయాను. దాతల ప్రత్యేక దర్శనం రద్దుచేయడంవల్ల, నా దాతృత్వ పాస్ బుక్ పనికిరానిదైంది. నేను సేవాసదన్ లోనే విశ్రాంతి తీసుకున్నాను. మర్నాడు నాకుకాస్త నయమనిపించింది. ఆ రోజు సాయంత్రం మా తోటి వాళ్లతో కలిసి శ్రీవారి దర్శనానికై బయలుదేరాను. క్రితంరోజటి రద్దీ ఇంకా తగ్గలేదు. అయినా పట్టుదలతో ముందుకు సాగాను. నా ప్రయత్నం ఫలించింది. వైకుంఠ ఏకాదశినాడు కాకపోయినా వైకుంఠ ద్వాదశినాడు స్వామివారి దర్శనభాగ్యం కలిగింది. నాకు ఊరట లభించింది.

మరుసటి రోజు షరా మామూలే. నాకు మళ్లీ ఆయాసం, అలసట. ఆ రోజు మళ్లీ పడకేశాను. మా తోటి వారితోసేవకు పోలేకపోయాను. ఎంతో ప్రయాసతో సేవాసదన్ ఎదుటి 'మాధవం' లో భోజనానికి వెళ్లాను. వచ్చి, మళ్లీపడుకున్నాను. దాదాపు నాలుగు గంటలకు లేచి, ప్రక్కనున్న బస్ డిపో క్యాంటీన్ లో టీ తాగాను. మనసులోఆందోళన. చాతీలో నొప్పి, గుండెలో దడ. తల తిప్పసాగింది. నాలుగడుగులు వేస్తే ఆయాసం. తట్టుకోవడం నా వల్లకాలేదు. మెల్లగా సేవా సదన్ దగ్గర్లోని 'అశ్విని ఆస్పత్రి' వైపు అడుగులు వేశాను. వంద గజాల దూరం కూడా లేని ఆఆస్పత్రి చేరేలోగా ఆరు చోట్ల కూచుని సేద తీరాల్సి వచ్చింది.

ఎలాగైతేనేం ఆస్పత్రి చేరుకుని ఫారం నింపి హార్ట్ స్పెషలిస్ట్ దగ్గరికి వెళ్లాను. నాతో ఎవరైనా వచ్చారా? అని అడిగితేమా వాళ్లంతా సేవకు వెళ్లారని చెప్పాను. ఆయన పరీక్షచేసి వెంటనే అడ్మిట్ చేసుకున్నాడు. కొన్ని మందులు ఇచ్చి,ఇ.సి.జి., టూడీ ఇకో మొదలగు పరీక్షలు చేసి, గుండెపోటు వచ్చిందని నిర్ధారించారు. వారి చికిత్సతో వ్యాధిఅదుపులోకి రాలేదు. వెంటనే నన్ను, అదే ప్రాంగణంలో ఉన్న అపోలో ఆస్పత్రికి తరలించారు.వారు వివిధ పరీక్షలు, మందులు, మాత్రలు, ఇంజక్షన్ లు మొదలగు వాటితో రెండు గంటలు శ్రమించి, గుండెనుఅదుపులోకి తెచ్చారు. గుండె స్థితి నిలకడగా ఉంచడానికి తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థానం వారిశ్రీ వేంకటేశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(స్విమ్స్) కి తరలించాలని

గత రెన్నెళ్లనుంచి తరచూ ప్రయాణాలు, ఫ్లైట్ తప్పిపోయినందుకు పదివేల రూపాయల అదనపు ఖర్చు, కొన్నివందల సందేశాలు, కాంటాక్ట్ నంబర్లున్న, ఇరవై వేల రూపాయల మొబైల్ పోవడం, ఎంతో భక్తితో, ఎన్నో ఆశలతోస్వామివారి సేవకని వస్తే అక్కడ సేవకు అనుమతించకపోవడం, ఇవన్నీ విషయాలు మనసులో సుడులు తిరుగుతుంటేఇక ప్రశాంతంగా ఎలా ఉంటాను? మూడు దశాబ్దాల నుండి డయాబిటీస్ తో సహజీవనం చేస్తూ, బైపాస్ సర్జరీకిగురైన నేను, మా బృంద సభ్యులకు దీటుగా నడవాలనుకోవడం సాహసం కాదూ? ఆ సంఘటనలను మననంచేస్తుండడంతో నాకు అనుసంధానించిన మానీటర్లో అల్లకల్లోలం సృష్టించాయి.నర్సులనుండి సందేశం అందుకున్నడాక్టర్లు, హుటాహుటిన వచ్చి, చికిత్స మొదలుపెట్టారు.

నిర్ణయించారు. నాతో ఎవరైనాతోడుంటేనే గాని స్విమ్స్ కి తీసుకుపోలేమన్నారు. ఆస్పత్రి సిబ్బంది సేవాసదన్ సంప్రదించి, నేను ఆస్పత్రిలో అడ్మిట్అయినందువల్ల మా సప్తగిరి సేవా సమితి సభ్యులను అశ్విని ఆస్పత్రి సంప్రదించమని పబ్లిక్ అడ్రెస్ సిస్టం లోప్రకటించారు. అరగంటైనా స్పందన లేకపోయే సరికి, మళ్లీ సేవా సదన్ వారిని సంప్రదించారు. పరిస్థితి తీవ్రతనుపరిగణించి, వారు వెంటనే, మా వాళ్లు సేవలో ఉన్న చోటికి ఓ మనిషిని పంపారు. అరగంటలో మా బృందనాయకుడు, మరో ఇద్దరు సభ్యులు హుటాహుటిన నేనున్న ఆస్పత్రికి వచ్చారు. వెంటనే నన్ను, నా తోటి వారినిఆస్పత్రి వారి అంబ్యులెన్స్ లో స్విమ్స్ కి తరలించే ఏర్పాటు చేశారు.

అది డిసెంబర్ నెల చివరి రోజు. ముంబయిలో మా కుటుంబీకులు, ఆంగ్ల కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించే సంబరాల్లోఉంటారు. అందుకని నా విషయం, మా వాళ్లకి తెలుపవద్దని తిరుపతి వైపు వెళ్లే ప్రయాణంలో, మా బృందనాయకునికి విన్నవించాను. ఆయన 'సరే చూద్దాం' అన్నారు.

స్విమ్స్ చేరగానే నన్ను ఎమర్జెన్సీ వార్డ్ లో అడ్మిట్ చేసుకుని చికిత్స మొదలుపెట్టారు. సెలైన్ పెట్టి, చాతీకి ఏవోగొట్టాలు పెట్టి, వాటిని ఓ మానీటర్ కి అనుసంధించారు. ప్రతి పదిహేను నిమిషాలకు మానీటర్ చూపించే

ఎత్తుపల్లాలను గమనించి, కేస్ షీట్ లో నమోదు చేశారు. కొన్ని మందు బిళ్లలు ఇచ్చి, ఇంజక్షన్ లు కూడా ఇచ్చారు.

అప్పుడు నాకు కాస్త నయమనిపించి, నిద్రపోయాను. ఐనా నా చాతీకి అంటించిన గొట్టాలు వాటి పని చేస్తూనే

ఉన్నాయి. నా లోపలి స్పందనలను ప్రదర్శిస్తూనే ఉన్నాయి. నేను హాయిగా నిద్రపోయాను కాని, మా బృందనాయకుడు, మరో ఇద్దరు సభ్యులు కళ్లల్లో వత్తులు పెట్టుకుని నన్ను కనిపెడుతూ ఉన్నారట.

గత రెన్నెళ్లనుంచి తరచూ ప్రయాణాలు, ఫ్లైట్ తప్పిపోయినందుకు పదివేల రూపాయల అదనపు ఖర్చు, కొన్నివందల సందేశాలు, కాంటాక్ట్ నంబర్లున్న, ఇరవై వేల రూపాయల మొబైల్ పోవడం, ఎంతో భక్తితో, ఎన్నో ఆశలతోస్వామివారి సేవకని వస్తే అక్కడ సేవకు అనుమతించకపోవడం, ఇవన్నీ విషయాలు మనసులో సుడులు తిరుగుతుంటేఇక ప్రశాంతంగా ఎలా ఉంటాను? మూడు దశాబ్దాల నుండి డయాబిటీస్ తో సహజీవనం చేస్తూ, బైపాస్ సర్జరీకిగురైన నేను, మా బృంద సభ్యులకు దీటుగా నడవాలనుకోవడం సాహసం కాదూ? ఆ సంఘటనలను మననంచేస్తుండడంతో నాకు అనుసంధానించిన మానీటర్లో అల్లకల్లోలం సృష్టించాయి.నర్సులనుండి సందేశం అందుకున్నడాక్టర్లు, హుటాహుటిన వచ్చి, చికిత్స మొదలుపెట్టారు. ఏవో కాప్స్యూల్స్, ఇంజక్షన్ లు ఇచ్చి పరిస్థితిని అదుపులోకితెచ్చారు. వారిచ్చిన మందుల ప్రభావం వల్లనేమో నేను నిద్రలోకి జారుకున్నాను.

మధ్యాహ్నం దాదాపు ఒంటి గంట ప్రాంతంలో మెళకువ వచ్చి చూస్తే ? బెడ్ ప్రక్కన నా అర్ధంగి, కుమారుడు దర్శనమిచ్చారు. నా ఆశ్చర్యానందాలకంతు లేదు. వారొచ్చి అరగంటకు పైనే అయిందట. నేను గాఢ నిద్రలో ఉండడంవల్లలేపలేదు. నాకు అంత సీరియస్ గా ఉన్నా ఎందుకు తెలుపలేదనే మాట పడడం ఇష్టంలేక, నేను వద్దని చెప్పినా, మాబృంద నాయకుడు క్రితం రాత్రి పన్నెండు గంటల తర్వాత, మా ఇంటికి ఫోన్ చేసి విషయం చెప్పారట. వెంటనే మాఅబ్బాయి, ఆన్ లైన్ లో చూస్తే ఉదయం రేణిగుంటకు డైరెక్ట్ ఫ్లైట్ లేదు. అందుకని చెన్నైకి వేకువజాము ఫ్లైట్ బుక్చేసుకుని, అక్కడినుండి టాక్సీలో తిరుపతి వచ్చారు. వారిని చూడగానే నా మొహం వెలిగింది. మా బృందనాయకుడు, మరో ఇద్దరు సభ్యులు, ఎంత కంటికి రెప్పలా కాపాడినా, తన కుటుంబ సభ్యులు ప్రక్కన ఉంటే ఆధీమానే వేరు. సహజంగానే బ్లడ్ ప్రెషర్, పల్స్, నార్మల్ కి వచ్చాయి. ఆరోజు పూర్తిగా నా ఆరోగ్య స్థితిని గమనించి,వివిధ పరీక్షలు, వాటి ఫలితాల ఆధారంగా చికిత్స చేసి, మొత్తానికి నన్ను నార్మల్ స్థితికి తెచ్చారు. ఆ మరుసటి రోజు,అంటే జనవరి రెండవ తేదీన స్విమ్స్ ఆస్పత్రి నుండి విముక్తి లభించింది. నాకు జరిపిన పరీక్షలు, చికిత్స వివరాలు,ఇచ్చిన మందులు మొదలగు వివరాల పట్టిక ఇచ్చి, ముంబయిలో చికిత్స కొనసాగించమన్నారు.

దాదాపు మృత్యు వాకిట చేరిన నన్ను, ఆ స్వామి వారు, మా సేవా బృందం సభ్యుల, అశ్విని, అపోలో, స్విమ్స్ఆస్పత్రుల సిబ్బంది ద్వారా ఇహలోకానికి తిరిగి తీసుకువచ్చారు. ప్రైవేట్ కార్పోరేట్ ఆస్పత్రిలో కొన్ని లక్షలరూపాయల ఖర్చయ్యే చికిత్స, కానీ ఖర్చులేకుండా జరిగింది. అందుకని ఆ వేంకటేశ్వర స్వామికి మరోసారిమనసులోనే నమస్కరించాను.

ఆ రోజు టీ.టీ.డీ. వారి 'శ్రీనివాసం' వసతి గృహంలో బస చేశాము. నా విషయం తెలిసి, బెంగుళూరు నుండి, నామేనల్లుడు వచ్చాడు. నన్ను అతని పర్యవేక్షణ లో ఉంచి, నా శ్రీమతి, కొడుకు స్వామివారి దర్శనానికి తిరుమలవేళ్ళారు. నా అనారోగ్యం మూలంగానైతేనేమి, మా వారికి, శ్రీవారి దర్శన భాగ్యం కలిగింది.

ఎట్టకేలకు జనవరి మూడవ తేదీ రాత్రి బస్ లో చెన్నై బయలుదేరి, అక్కడి నుండి మర్నాడు ఉదయం ఫ్లైట్ లోముంబయి చేరుకున్నాము. ఏమైతేనేం కథ సుఖాంతమయింది. ఇప్పుడు చెప్పు హరీ, నేను శ్రీవారి సేవచేశానా? లేకస్వామివారే నాకు సేవ చేశారా?"

"శ్రీ వేంకటేశ్వర స్వామి పట్ల నీకున్న శ్రద్ధ, సేవకై నువు పడ్డ తపన, మొదలైన వన్నీ పరిగణించే ఆయన నిన్నుకాపాడాడు ఆ శ్రీనివాసుడు. ఇక్కడ నీకింకా నూకలు చెల్లలేదు కాబట్టి నా ముందున్నావు. నీ అనుభవాలను నీకే

ప్రత్యేకమైన కథనంతో రక్తి కట్టించిన నీకూ, నిన్ను రక్షించిన ఆ మలయప్ప స్వామికి శతకోటి వందనాలు." రెండుచేతులు జోడించి నమస్కారం పెట్టాడు నా నేస్తం.

హరే రామ హరే కృష్ణ మందిరం లోని రాధా కృష్ణులకు మరొక్కసారి ప్రణామాలు చేసి, మేము మా మా ఇళ్లకు బయలుదేరాము.

## వెండి తెరకు వెన్నెల సంతకం సినారె!

ఏ కవి ప్రతిభా పాటవాలను వీక్షించి
తెలుగు కళామ తల్లి పులకించి పోయిందో
ఏ కవి కలాన్ని చూసి
అక్షరాలు ఆనంద తాండవం చేసాయో
ఏ కవి రాస్తే
పగలే వెన్నెల కు( వి)రిసిందో
ఏ కవి కవితావనంలో
లలిత పద సౌరభం గుబాళించిందో
ఏ కవి గళం వింటే
వీనులకు విందయిందో
ఏ కవి లేఖిని నుండి
కొంగ్రొత్త సాహితీ ప్రక్రియలు పురుడు పోసుకున్నాయో
ఏ కవి ఇంటి పేరుకు
కవిత చిరునామా అయ్యిందో
ఏ కవి గేయం
వెండి తెరకు వెన్నెల సంతకం అయ్యిందో
ఏ కవిని వీక్షిస్తే
తెలుగు సంస్కృతీ , సంప్రదాయాలు సాక్షాత్కరించాయో ..
ఏ కవి ధిషణకు
పదవులు ఏరి కోరి వరించి మురిసిపోయాయో
ఏ కవి వల్ల
తెలుగు కీర్తి పతాక విశ్వవ్యాప్తమయ్యిందో
ఏ కవి విద్వత్తు నచ్చి
జ్ఞానపీఠమే మురిసిపోయిందో
ఏ కవి , కవిత్వాన్ని
తన ఊపిరిగా శ్వాసించి , శాసించాడో
ఆ కవే ..
మహాకవి సినారె!
ఆ మహాకవి
తెలుగు కవితై నిలిచాడు
తెలుగు పాటై వెలిగాడు
తెలుగు మాటై మిగిలాడు
తె(వె )లుగు బాటై వెలిసాడు
అక్షరానికి మరణం లేదు
అక్షరమైన ఆ సుకవికీ మరణం లేదు ;
జననం తప్ప !



ఆ మన 'సుకవి' సినారెకివే నా అక్షర నివాళి
(మూడేళ్ళ క్రితం భౌతికంగా మనకు దూరమైన
జ్ఞానపీఠ పురస్కృతులు
కీ.శే .డా.సినారాయణరెడ్డి
గారి స్మృతిలో ...)

-బాలవర్ధిరాజు మల్లారం

## సినారె 'పాట'వం- సినారె పాటలు సిరివెన్నెల మూటలు

ఎన్ని యుగాలకైనా చెక్కుచెదరని కోటలు
అన్నాడట శ్రోత ఒకడు నిండు సభలో
పగలే వెన్నెల ఎక్కడని?
సంధించెను సమాధానం టక్కుమని
'నీ ఊహకు కళ్ళు లేవు ' కూర్చోమని.
అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం '
కాదని చెప్పండెవడైనా దమ్ముంటే.
కాడు దాటి కడదాకా రమ్మనండి ప్రేముంటే.

దీపానికి కిరణం ఆభరణం
రూపానికి సుగుణం ఆభరణం'
ఎంతటి సరళ పదపంకజ పరిమళాలు
అక్షరానికి మొలిచిన భావ కిరీటాలు.

'మూగనేలకు నీళ్ళందివ్వని
వాగు పరుగు దేనికనీ'
అలతి పదాలు పొదిగిన అక్షరాభరణాలు
అనితరసాధ్యమందరికీ ఈ భావప్రయోగాలు

'ఆడవే మయూరి
నటనమాడవే మయూరీ'
పాటకాడలేక పాదాలు తడబడె అభిసారిక.
పరవశింపజేసె పామరులసైతమాశబ్దతాండవ గీతిక.

అన్నయ్య సన్నిధి
అదే నాకు పెన్నిధి'
అన్నాచెల్లెల అనుబంధానికి
అక్షర వీలునామా.
కనిపించని దైవానికి అన్నయ్యే చిరునామా.

మంచితనానికి ఫలితం వంచన
చివరికి మిగిలేదేమిటి ఆవేదన'
మంచితనం శృతి మించిన
వంచన తప్పదని శాసనం.
అనాది దురాచారాలకు అడ్డుకట్ట పదజాలం.

వేయ్ రా మా దొరగారికి వీరగంధాలు
సైరా మా దొరసాని కి పారిజాతాలు.'
దొరసాని అందమంతా
ఆరబోసిన మల్లెపూలు.
దోరవయసు ను దోచుకున్న
ప్రణయాక్షర దీవిటీలు. '

'చిగురులు వేసిన కలలన్నీ
సిగలో పూలుగ మారినవి'
అడవిలోని పువ్వులన్నీ
హాయిగ 'కోరస్' పాడగా.
నింగిలోని చందమామ
విందుకు దిగివచ్చె నేరుగా.

పాటలోని పనితనం ఎవరి తరం ?
ప్రతి పదంలో మెరిసింది సినారె సంతకం.
(సినారె జయంతి సందర్భంగా)



-మాయకుంట్ల నారాయణరెడ్డి
9989686603

## అక్షయం..ఆ అక్షరం

మట్టి మనిషి మహోన్నతుడు కావాలి
అల్పాత్ముడు చీకటికి నేస్తమంటూ
సమత పంట కోసేందుకే, కవీ,సినారే
మానవతా విత్తనాలు
అన్నిపొలాల్లో (ప్రక్రియలు) చల్లావు
మా మాతృభాష తీయనైనదని
తూర్పు భాషల్లో ఇటాలియనని
అక్షరాల్లో చదివాము
నీగొంతులో విన్నాక..కవిగాయకా
ఆ తేనెల రుచి ఎంత.. జుర్రుకున్నాము
భాష మీద మమకారమంతా
నీ కళ్ళల్లో వెలుగులై ప్రవహించేది
నీ గళం ఎలుగెత్తితే
శ్రోతల గుండెలు, చేసే ఆనంద నాట్యంలో
ఎగిసిన అశ్రువులు
ప్రేక్షకుల చెక్కిళ్ళపై
జలపాతాలై తకధిమిలాడేవి
ఆహావ భావాలు
నీ సమ్మోహన మేజిక్ రియలిజమ్!
నువ్వులేని సాహితీ సాయంత్రాలు
మూగబోయిన ఒంటరి సన్నాయిలు!
సినారే నీ పాట ఓ వన్నెల దొరసాని
తెలుగు హృదయాలనే కాదు
అఖిల భారత పాట ప్రియుల్ని దోచుకుంది
తెలుగు సాహితీ వనంలో
లక్షల అక్షర వృక్షాలు
కవితా సుమ పరిమళాలు
గేయ నాటికల రసరమ్య చిత్రాలు
గజళ్ళు-బుర్రకథలు..ప్రపంచ పనులు
అక్షర పంటలే..బస్తాలనిండా!
'రా..వెన్నెల దొరా..' అంటూ
వరించింది ద్వితీయ జ్ఞానపీఠం!
ఇప్పుడు మేము..అక్షరాన్నికోల్పోయిన వాళ్ళం
అమ్మ చేయి విరిచినచంటి పిల్లలం
మా గుండెల్లో ఆదరించిన శూన్యం
దుఃఖ సాగరం కన్నీటి జలపాతం
కాలమెంత కరిగినా..తరగదు ఈ దుఃఖ భారం..



- ఝాన్సీ కె.వి. కుమారి
సెల్: 90108 23014

వాసా ఫౌండేషన్
మరియు
నేటినిజం దినపత్రిక
సంయుక్త ఆధ్వర్యంలో



ప్రముఖ రచయిత్రి డాక్టర్ వాసా ప్రభావతి
స్మారక కవితల పోటీలు
కరోనా మహమ్మారి విజృంబన నేపథ్యంలో
ప్రజలెదుర్కొంటున్న అనేకానేక సమస్యలపై దృష్టి సారించి
"వలస కార్మికులు"
అన్న అంశం మీద మీ కవితాస్త్రాల్ని సంధించండి

బహుమతుల వివరాలు:
- మొదటి బహుమతి : రూ.5000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- రెండవ బహుమతి : రూ.2,500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- తృతీయ బహుమతి : రూ.1,000/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం
- 10 ప్రోత్సాహక బహుమతులు: రూ.500/- జ్ఞాపిక, ప్రశంసాపత్రం

పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసాపత్రం

బహుమతులు గెలుచుకున్న కవితలతో పాటు ప్రచురణకు ఎంపికచేసిన కవితలను 'నేటినిజం'లో ప్రచురించబడును.

నిబంధనలు:
1) కవిత 25 లైన్లకు మించకూడదు.
2) వలస కార్మికుల సమస్యలపైనే ఉండాలి.
3) అనువాద కవితలు పోటీకి అంగీకరించబడవు
4) కవితను ఏ పత్రికకు పంపలేదని, సోషల్ మీడియాలో పోస్ట్ చేయలేదని ఈ పోటీ నిమిత్తమే రాసినదని హామీ తప్పక జత చేయాలి.
5) హామీ పత్రంతో మీ పేరు, ఫోటో, పూర్తి చిరునామా తప్పని సరి.
6) ఒకరు ఒక కవితను మాత్రమే పంపవలెను.

కవితలు పంపవలసిన చిరునామా:
'నేటినిజం' దినపత్రిక, ఎస్.ఆర్.టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-20.
E-mail : netinizam2020@gmail.com
కవితలు పంపాల్సిన చివరి తేది : 15-8-2020

## నాటి సభలు, సమావేశాలు...

జులై 16 నుండి జులై 22 వరకు

### జ్ఞాపకాలు — జులై 16



జులై 16, 2017న నెల్లూరులో గుర్రాల రమణయ్య రచన "మాట ముల్లు" కవితా సంపుటి ఆవిష్కరణలో పి.శ్రీనివాస్‌గౌడ్, చిరంజీవి, డా॥ టి. సుధాకర్, గుర్రాల రమణయ్య, కె.శివారెడ్డి, ఆవిష్కర్త నేటినిజం దినపత్రిక సంపాదకులు బైసదేవదాసు, డా॥జి. మురళీధర్.



జులై 16,2017న నెల్లూరులో గుర్రాల రమణయ్య రచన "మాట ముల్లు" కవితా సంపుటి ఆవిష్కరణలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసును సత్కరిస్తున్న ప్రముఖ కవి కె.శివారెడ్డి, చిరంజీవి, పి.శ్రీనివాస్‌గౌడ్, గుర్రాల రమణయ్య, డా॥జి. మురళీధర్.

### జ్ఞాపకాలు — జులై 17



జులై 17, 2012న రవీంద్రభారతిలో సినీ నటుడు, కవి కె.రంగనాథ్ రచించిన 'నడత' కవితా సంపుటి ఆవిష్కరణ సభలో డా॥ రావూరి భరద్వాజ, డా॥కె.వి.వరప్రసాద్‌రెడ్డి దంపతులు, డా॥సి.నారాయణ రెడ్డి, ఆవిష్కర్త డా॥ అక్కినేని నాగేశ్వరరావు, సారిపల్లి కొండలరావు, కె.రంగనాథ్, డా॥ రాళ్ళబండి కవితా ప్రసాద్, బైస దేవదాసు, డా॥ తిరునగరి



జులై17, 2012న రవీంద్రభారతిలో సినీ నటుడు,కవి కె.రంగనాథ్ రచించిన 'నడత' కవితా సంపుటి ఆవిష్కరణ సభలో ప్రసంగిస్తున్న కె. రంగనాథ్. వేదికపై డా॥సినారె, అక్కినేని నాగేశ్వరరావు, డా॥రాళ్ళబండి కవితా ప్రసాద్, బైస దేవదాసు.

### జ్ఞాపకాలు — జులై 18



జులై 18, 2007న హైదరాబాద్ చిక్కడపల్లి గ్రంథాలయంలో త్రిపురనేని మహారథి రచన 'మాదుపగిలే మూడు శతకాలు" ఆవిష్కరణలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసును సత్కరిస్తున్న ఎమ్మెస్ రెడ్డి, మహారథి, ఉండేల మాలకొండారెడ్డి, డా॥పోతుకూచి సాంబశివరావు, సామల రమేష్.



నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసును అభినందిస్తున్న ఎమ్మెస్ రెడ్డి, మహారథి,ఉండేల మాలకొండారెడ్డి, డా॥పోతుకూచి సాంబశివరావు, సామల రమేష్.

### జ్ఞాపకాలు — జులై 19



జులై 19న త్యాగరాయ గానసభలో 'తెలుగు కళాపీఠం' ఆధ్వర్యంలో "మహాకవి దాశరథి" అనే అంశంపై జరిగిన పద్య కవితా పోటీలో ప్రథమ బహుమతి 3వేల నగదు పురస్కారం అందుకుంటున్న డా॥శేషం రామానుజాచార్యులు. వేదికపై చిక్కా రామదాసు, యాదగిరి, డా॥ చిల్లరభవాని, నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసు, డా॥ తిరునగరి, డా॥ తిరుమల శ్రీనివాసాచార్యులు.



జులై 19, 2012న రాగరాగిణి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డా॥ఓలేటి పార్వతీశం డా॥ ద్వా.నా.శాస్త్రిలను సత్కరిస్తున్న ఎం.వి.సుబ్బలక్ష్మీ, నేటినిజం సంపాదకులు బైస దేవదాసు, కళావెంకట దీక్షితులు, ఎం.వి.రమణకుమారి.

### జ్ఞాపకాలు — జులై 20



జులై 20, 2008న జుబ్లీ హాలులో జరిగిన సమావేశంలో నేటినిజం దినపత్రిక సంపాదకులు బైస దేవదాసుకు ఆరోగ్యశ్రీ కార్డు అందజేస్తున్న ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖర రెడ్డి. వేదికపై సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్, మంత్రివర్యులు బొత్స సత్యనారాయణ, రాష్ట్ర సమాచార శాఖ కమీషనర్ డా॥ కె.వి.రమణాచారి.



2014లో కళా సుబ్బారావు కళావేదికలో జరిగిన ఒక సభలో డా॥ సినారెను సత్కరిస్తున్న బైస దేవదాసు.

### జ్ఞాపకాలు — జులై 21



జులై 21, 2018న హైదరాబాద్‌లోని కళా లలిత కళావేదికలో ప్రముఖ సాహితీవేత్త శ్రీ దేవరకొండ బాలగంగాధర్ తిలక్ జయంతి సభలో వై. రాజేంద్రప్రసాద్, కళా జనార్ధనమూర్తి, శివరామకృష్ణ, లక్ష్మీ, ముఖ్య అతిథి బైస దేవదాసు, తదితరులు.



జులై 21, 2019న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తండ హరీష్‌గౌడ్ కవితా సంపుటి "నీటిదీపం" ఆవిష్కరణలో బైస దేవదాసు, జూలూరి గౌరీశంకర్, తండ హరీష్‌గౌడ్ తల్లిదండ్రులు, తండ హరీష్‌గౌడ్,ఆవిష్కర్త కె. శివారెడ్డి, కవి యాకూబ్, ఆచార్య ఎస్.రఘు, భూపతి వెంకటేశ్వర్లు, శరత్ చంద్ర.

### జ్ఞాపకాలు — జులై 22



జులై 22, 2015న తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో దాశరథి కృష్ణమాచార్య 91వ జయంతి సందర్భంగా "దాశరథి కృష్ణమాచార్య "వచన రచనలు" పుస్తకావిష్కరణలో డా॥ జలంధర్‌రెడ్డి, డా॥ నందిని సిధారెడ్డి, టి. ఉదయవర్లు, ఆచార్య అనుమాండ్ల భూమయ్య, డా॥ మధుసూదన్‌రెడ్డి, ఆచార్య పి. నీరదారెడ్డి, జస్టిస్ బి. సుభాషణ్ రెడ్డి, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ఆర్. విద్యాసాగర్ రావు, డా॥ ముదిగంటి సుజాతరెడ్డి, డా॥అమ్మంగి వేణుగోపాల్, బుక్కా బాలస్వామి, బైస దేవదాసు.



జులై 22, 2012న హైదరాబాద్‌లోని సితార హోటల్‌లో ఆచార్య మసన చెన్నప్ప 'సుందరకాండ' (అనువాదం) గ్రంథావిష్కరణలో రచయిత ఆచార్య మసన చెన్నప్ప, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥కె.వి.రమణాచారి, సినీ నటులు, కవి, కె.రంగనాథ్, దాస్యం సేనాధిపతి, రాధశ్రీ, డా॥ తిరునగరి,

# విమర్శలతో ఎదుర్కోవడం సరికాదు

హైదరాబాద్, జులై 22:రాష్ట్రంలో కరోనా టెస్టుల విషయంలో సర్కారు తీరును హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టిన నేపథ్యంలో దీనిని ఓ సూచనగా తీసుకుని ప్రభుత్వం పటిష్టమైన చర్యలకు పూనుకోవాలి. సిఎం కెసిఆర్ సమీక్షలో అధికారులు ఓ రకంగా తప్పుడు నివేదికలు ఇచ్చి తప్పుదోవ పట్టించడం సరికాదు. ఎంతో కష్టపడుతున్నా హైకోర్టుకు తప్పుడు నివేదికలు ఇస్తున్నారని...మీడియా కూడా తప్పుడు వార్తలు ప్రొజెక్ట్ చేస్తోందని, కేసుల కారణంగా హైకోర్టు చుట్టు తిరగలేక పోతున్నామని అధికారుల సిఎం కెసిఆర్‌తో జరిగిన సమీక్షలో తెలిపారు. నిజానికి ఇందులో కొంత నిజం లేదని చెప్పలేం.అయితే విమర్శలను సూచనలుగా తీసుకుని, హైకోర్టు ఆదేశాలను అమలు చేయడం ద్వారా ప్రజల్లో కూడా భరోసా కల్పించేలా అధికార యంత్రాంగం పనిచేస్తే మంచిది. సిఎం కెసిఆర్ దక్షతకు అనుగుణంగా అధికారులు కూడా క్షేత్రస్థాయిలో వివిధ ఆస్పత్రుల్లో ఉన్న పరిస్థితు లను పరిశీలించాలి. అక్కడ జరుగుతున్న చికిత్సలను తెలుసుకోవాలి. ఆక్సిజన్ తదితర సమస్యలు లేకుండా చూడాలి. వేయికోట్లు అయినా ఖర్చు పెడతామన్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా ఒక్క ప్రాణం కూడా పోకుండా వైద్య సేవలను పటిష్టం చేయాలి. వైరస్ మహమ్మారి కోరలు చాచిన సమయంలో.. వైరస్‌కు అసలు మందేలేని దుస్థితిలో తగు చర్యలు తీసుకోవడంలో ముందుండాలి. కరోనా కట్టడికి ప్రపంచ దేశాల అనుభవాలను పాఠాలుగా స్వీకరించాలి. టెస్టులు, చికిత్సల్లో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని హైకోర్టు మండిపడడమే గాకుండా అలాంటి వాతావరణమే ఇప్పుడు ఉందన్న విషయం కాదనలేం. నిజానికి దవాఖానాలకు వెళ్లి అధికారులు మదింపు చేయాలి. హైకోర్టుకు నివేదిక ఇవ్వడంలో తప్పు లేదు. తామంతా బాగానే చేస్తున్నామని చెప్పుకునే ముందు నిజానిజాలను నిజాయితీగా అంగీకరించాలి. సర్కారు స్వయంగా నిర్దేశించుకున్న మేరకు కూడా టెస్టులు చేయలేక పోవడం అలసత్వమేనని హైకోర్టు స్పష్టం చేసింది. ఇరుగుపొరుగు రాష్ట్రాలు లక్షల సంఖ్యలో టెస్టులు చేస్తున్న సమయంలో తెలంగాణలో అలా చేయక పోవడంపై సహజంగానే హైకోర్టు నిలదీసింది. టెస్టులు చేస్తున్నా మని చెప్తున్నా... ప్రజల ఆందోళనలు, సెల్ఫీలు చూస్తుంటే ఎక్కడా అలాంటి పరిస్థితి లేదని అర్థం చేసు కోవాలి. దీనిపై భేషజాలకు పోకుండా ముందుగా ఆస్పత్రుల్లో పరిస్థితులపై నిజాలు తెలుసుకోవాలి. రాష్ట్ర సర్కారు నిర్వాకం ప్రజల జీవించే హక్కును కాలరాసేలా ఉందని హైకోర్టు కామెంట్ చేసిందంటే దారుణ పరిస్థితులు ఉన్నాయని గుర్తించక తప్పదు. అలాగని హైకోర్టునో లేదా ప్రజలనో తప్పు పట్టడానికి లేదు. ఆస్పత్రులు ఘోరంగా ఉన్నాయన దానికి ప్రజాప్రతినిధులు ఎవరు కూడా గాంధీలో చికిత్సకు చేరలేదంటేనే అర్థం చేసుకోవాలి. ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించే విషయంలో మాటల్లో కాకుండా చేతల్లో చూపాల్సిన అసవరం ఉంది. కరోనాపై వస్తున్న విమర్శలపై పాలకులు ఎదురుదాడి చేయకుండా లోపాలను గుర్తించి ముందుకు సాగాల్సి ఉంది. సిఎం కెసిఆర్‌తో చర్చించిన అధికారులు అందులో నిజమున్నా..విమర్శలపై తగురీతిగా స్పందించడమూ ముఖ్యమే అని గుర్తుంచుకోవాలి. కరోనాకు నిజానికి ఎలాంటి చికిత్సా లేదు. ఇంట్లో వాడుతున్నమందులే ఆస్పత్రుల్లోనూ ఇస్తున్నారు. అలాంటప్పుడు ఆస్పత్రుల్లో ఎందుకు సమస్యలు వస్తున్నాయన్నది ముఖ్యం. సిఎం కెసిఆర్ కూడా క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను సమగ్రంగా విశ్లేషించాలి. అధికారులు ఇచ్చే నివేదిక సరిగా ఉంటుందా లేదా అన్నది వేగుల ద్వారా తెలుసుకోవాలి. విపక్షాల, ప్రజల విమర్శలను సానుభూతితో చూసి, పరిశీలన చేయాలి. ఇవన్నీ పక్కన పెట్టి మంత్రులు ఎదురుదాడి చేయకుండా కట్టడి చేయాలి. కరోనా కొత్త వైరస్ కావడం, దానికి సమగ్రమైన చికిత్సా విధానం లేకపోవడం కారణంగా ప్రపంచవ్యాప్తంగా వస్తున్న అనుభవాలతోనే ముందుకు పోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మరోవైపు ప్రజలను నిరంతరంగా హెచ్చరిస్తూ స్వీయరక్షనలో ఉ ండేలా చైతన్యం చేయాల్సిందే. ఇప్పుడు అందరికి కరోనాపై ఎలా మెలగాలో అనుభవాలన్నీ అందుబాటులోకి వచ్చాయి. దీంతో మనం మరిత జాగరూకతతో ముందుకు సాగాలని గుర్తించాలి. ప్రజలకు మేమున్నామన్న భరోసా పాలకులు నుంచి పూర్తిస్థాయిలో రావాలి. ప్రజలు ఎంతగా జాగ్రత్తలు పాటిస్తున్నా ఇప్పుడు కరోనా అదరిని అంటుకునే స్థాయికి చేరింది. కరోనా టెస్టులు, కేసులకు సంబంధించిన వివరాలను ఎందుకు దాచిపెడుతున్నారని ధర్మాసనం ప్రశ్నించిన నేపథ్యంలో పూర్తి పారదర్శకంగా ముందుకు సాగాలి. ఇదిలావుంటే ఐసీఎంఆర్ రూల్స్ ప్రకారం టెస్టులు చేస్తున్నామని పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ శ్రీనివాసరావు పదేపదే చెప్తున్నారు. ఈ దశలో కరోనాపై పారదర్శకంగా ముందుకు సాగాల్సిన అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలి. హైకోర్టు ఆగ్రహాన్ని సూచనగా స్వీకరించి నిపుణలతో చర్చించి కరోనా వ్యాప్తి నిరోధానికి కఠిన చర్యలు తీసుకోవాలి. అలాగే కరోనా చికిత్సలకు ప్రాధాన్యం పెంచాలి. ఇందుకు అనుగుణంగా లోపాలను గుర్తించి గాంధీ తదితర ఆస్పత్రులను పటిష్టం చేయాలి. ప్రైవేట్ ఆస్పత్రుల్లో దోపిడీపై వస్తున్న ఫిర్యాదులను స్వీకరించి వాటిపై కఠిన చర్యలకు పూనుకోవాలి. లక్షల్లో బిల్లులు వేసి దోపిడీ చేస్తున్న ఆస్పత్రులను ఉపేక్షించాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదు. పిపిఇ కిట్లు, మాస్కులు, శానిటైజర్లు తదితరాలకు లోటు రాకుండా చూడాలి. మొదట్లో రోజూ సమీక్షించిన విధంగానే ఇప్పుడు కూడా నిరంతరాయంగా సమీక్ష చేస్తూ అధికారులను పరుగులు పెట్టించాలి. ఇంతకాలం నిబ్బరంగా ఉన్న ప్రజలకు ఇప్పుడు నిజంగానే కరోనా భయం పట్టుకుంది. ఎక్కడ తమకు ఈ మహమ్మారి అంటుకుంటుందో అన్న భయంలో పడ్డారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, డాక్టర్లు, వైద్య సిబ్బంది కూడా కరోనా బారిన పడుతున్న తీరు చూశాక సామాన్యుల్లో మరింతగా భయం బయలు దేరింది. ముందు జాగ్రత్తలపై ప్రజలను హెచ్చరించడం ద్వారా కరోనాను అరికట్టవచ్చు. అలాంటి ప్రయత్నాలు ముమ్మరం చేయాలి. అదికారులు ఈ రకమైన చర్యలు తీసుకుని ఉంటే ఇవాళ హైకోర్టుకు సమాధానం ఇచ్చుకునే పరిస్థితి వచ్చేది కాదు. అయితే సిఎం కెసిఆర్ ఇచ్చి ఆదేవాల మేరకు హైకోర్టుకు నివేదిక ఇస్తూనే క్షేత్ర స్థాయిలో ఉన్న లోపాలను కూడా సరిదిద్దుకునేలా అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలి. వివిధ వర్గాల నుంచి వస్తున్న ఆరోపణలు, విమర్శలను తేలికగా కొట్టి పారేయకుండా కార్యాచరణతో ముందుకు సాగాలి. విమర్శలను సమాచారంగా ఉపయోగించుకుని సాగితే సమస్యలు రావని గుర్తుంచుకోవాలి. ఇవన్నీ అనుభవంలోకి వచ్చిన దశలో అధికార యంత్రాంగం అందుకు అనుగుణంగా ప్రణాళికతో ముందుకు సాగాలి.

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న బుధవారం బాద్షా పోటీ ఫలితాలు

నిర్వహణ: మాలతి లత
అడ్మిన్: రమాదేవి కులకర్ణి
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

### ప్రథమ విజేత

#### కరోనా

కరోనా విసిరిన కారువలయంలో
చిక్కి శల్యమైన అందరం
బతకడానికి బతుకుతెరువు లేక
తినే తిండికోసం ఆశగా చూస్తూ
పనులు లేక పస్తులు పడుకుంటూ
ఎన్నో ఆశలు ఆశయాలు
అన్నీకూడా ఆవిరైపోతూ
×కన్న కలలు కంటనీరై తడుపగా×
గుండెలోని దుఃఖం గొంతుదాటి రాలేక
మూగబోయిన మణివీణ
మౌనరాగమై వినపించబట్టే
ఊగిసలాడే నావకు చుక్కాని అయినట్లు
ఆరిపోయేదీపానికి
ఆయువుపోసినట్లు
స్వయంఉపాధికై ఎంచుకున్న రంగం
నేడు ఉపాదై కడుపునింప
ఆశాకిరణమై కనపించి
ప్రకాశింపచేసిన వెలుగులు
'హస్తకళలు కాంతిదీపమై మెరిసినవి'
బతుకుకు బాసటగా నిలిచినవి...



-సత్యనీలిమ

### ద్వితీయ విజేత

#### నైపుణ్యాలు

కదులుతున్న కాంతిరేఖలుగా
అంతులేని ఆశాజ్యోతిలా..
విద్యార్జన కంటికి
కనబడుతూ ఊరిస్తుంటే..త

నిమ్న ,మధ్యతరగతి వర్గాల
బిడ్డల తల్లిదండ్రుల్లో మదిలో
కోటి ఆశలు....
రెక్కలు ముక్కలు జేసుకొని
పసిడి సీమలాంటి
పట్నంలో సదువులు కొంటె...
'కన్న కలలు కంటినీరై తడుపగా'
కొలువుల కోవెల మొక్కులు,
ముడుపుల బాటలో సాగుతుంటే...

కునుకు లేని కాలాలు తరలి
పోతుంటాయి...
పంట దిగుబడికి మద్దతు రాని
వర్షాలు మరలిపోతుంటాయి...

తెచ్చుకున్న తెలివితో,పెంచుకున్న
విలువలతో...
కుల వృత్తులు దైవంగా భావించి
బ్రతుకు దెరువు వెతుక్కుంటే...
'హస్తకలలు కాంతి దీపమై మెరిసినవి...'

అవ్వ అయ్యల కళ్ళు చెమ్మగిలినా
పెదవి తోటలో నవ్వులు విరబూస్తున్నాయి...
కళ్ళ ముందున్నందుకు కాని కాలంలో..



-శివరంజని
వకుళాభరణం

## రైల్వే పనులు చేస్తుండగా దుర్ఘటన

### రైలు ఢీకొని ముగ్గురు కార్మికుల దుర్మరణం

వికారాబాద్,జులై22(ఆర్ఎన్ఎ): రైలు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటన వికారాబాద్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై చోటు చేసుకుంది. వికారాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద 12 మంది రైల్వే సిబ్బంది ట్రాక్‌పై పెయింటిగ్ పనులు చేస్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి నుంచి వికారాబాద్ వైపు రైలు వచ్చింది. ట్రాక్‌పై పనులు చేస్తున్న సిబ్బందికి ఎలాంటి సమాచారం లేదు. దగ్గరికి వచ్చిన తరువాత రైల్వే ఉ ద్యోగులు గమనించారు. ట్రాక్‌పై నుంచి తప్పుకునే క్రమంలో ముగ్గురిని రైలింజన్ ఢీ కోట్టింది. ఈ ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. మిగతా తొమ్మిది మంది ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఘటన స్థలాన్ని రైల్వే ఉన్నతాధికారులు, వికారాబాద్ ఎస్పీ పరిశీలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కరోనా

ఓ రక్కసీ...
నువ్ మాపై దాడి మొదలెట్టిన
తొలినాళ్లలో ...
చేతులు కడిగి చప్పట్లు కొట్టి
గంటలు మోగించి..
దీపజ్యోతులు వెలిగించి...
గడప దాటకుండా ఇంట్లోనే ఉంటూ..
నిన్ను తరమాలని చూసాం

మాలో కొంతమంది చేస్తున్న
పొరపాట్లో లేక మా గ్రహపాట్లో
నువ్ పెట్రేగిపోతున్నావ్
మా ప్రాణాలను హరించేస్తున్నావ్..
చేతులు కడిగి కడిగి ..
మా ప్రాణాలమీద ఆశలకు నీళ్లొదిలేసుకున్నాం..

చేయిచాచితే చాలు మమ్మల్ని ఆవహించడానికి అడుగు దూరంలో కాచుకుని ఉన్నావ్
ఆర్థికావసరాలు ఒకపక్క ప్రాణాలమీద ఆశ ఇంకోపక్క..
ముందు నుయ్యి వెనుక గొయ్యిలా ఉంది మా పరిస్థితి..

ఇంకెన్నాళ్లు ఈ సామాజిక దూరాలు...
శానిటైజర్లతో సబ్బులతో చేతులు కడగడాలు...
ముక్కులు మూతులకు మాస్కులు కట్టుకోడాలు...

కరోనాతో పోతామో లేదో కానీ ఊపిరాడకనో
భయభ్రాన్తులతోనో చచ్చిపోయేలా ఉన్నాం...

ఏ దేవుడు కనికరిస్తాడో..
ఏ మందులు కనిపెడతారో...
మా ప్రాణం పోయేలోగా ... ఏదైనా జరిగి ...
మా ప్రాణాలు నిలబడితే .. అదే పదివేలు..



-దేవులపల్లి సునంద
8297744716

## కరోనా వ్యాప్తి నిరోధానికి ప్రచారం సాగాలి

### ప్రజల అప్రమత్తతే కరోనాకు మందు

### ఎండలో నిలబడడం,వేడినీళ్లు తాగడం చేయాలి

న్యూఢిల్లీ,జులై2(ఆర్ఎన్ఎ): కరోనా సోకినా, సోకకున్నా మనం తీసుకునే ఆహారం, అలవాట్లు ఇప్పుడు ముఖ్యమయ్యాయి. వివిధ రకాల కషాయాలు, దినుసులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వాట్సాప్ గ్రూపుల్లో రోజుకోరకమైన సలహాలు సూచనలు వస్తున్నాయి. కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణ కోసం ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆయుష్ విభాగానిదే. తరచూ చేతులు కడుక్కోవాలి. తుమ్ములు, దగ్గు వచ్చేటప్పుడు కర్చీఫ్ లేదా టీష్యూ అడ్డుపెట్టుకోవాలి. దీని ద్వారా కరోనా వైరస్‌తో పాటు ఇన్‌ఫ్లూయెంజా లాంటి పలు అంటువ్యాధులను నివారించవచ్చు. విద్యార్థులు, యువతకు ఈ సమాచారం తెలియజేయడం ద్వారా మరింత మందికి అవగాహన కల్పించవచ్చు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని రాష్ట్రాలు ప్రజలకు సరైన అవగాహన కల్పించడంపై ప్రచారం నిర్వహించాలి. శీతలంగా ఉండే వాతవరణంలోనే కరోనా వైరస్ ఎక్కువ కాలం బతుకుతుందని ఇప్పటి వరకు తేలిన నిజం. అలాగే శానిటైజర్లు వాడి ఎప్పటికప్పుడు చేతులు శుభ్రంగా ఉంచుకోవడం, మాస్కులు కట్టుకోవడం మినహా చేయగలిగింది లేదని నిపుణులు పదేపదే హెచ్చరిస్తున్నారు. ఇకపోతే కరోనా వైరస్ నుంచి రక్షించు కునేందుకు యునిసెఫ్ కొన్ని సూచనలు చేసింది. వైరస్ ఎక్కడ, ఎంత సేపు బతుకుతుందో ఇప్పటికే తెలియచేసింది. కరోనా సోకకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను వివరించింది. కరోనా గాలి నుంచి సోకదని, వస్తువులపై మాత్రమే ఉంటుందని తెలిపింది. వైరస్ అంటిన వస్తువులను ముట్టుకుని నోరు లేదా ముక్కు దగ్గర చెయ్యి పెడితేనే వైరస్ అంటుతుంది. వస్తువుల మీద ఉన్న వైరస్ బతికేది కేవలం 12 గంటలే. నీళ్లు, సబ్బుతో కడిగితే వైరస్ పోతుంది. బట్టలపై 9 గంటల పాటు వైరస్ బతుకుతుంది. రెండు గంటలు ఎండలో ఆ బట్టలను పెడితే వైరస్ చచ్చిపోతుంది. 6 నుంచి 27 డిగ్రీల టెంపరేచర్ వద్ద వైరస్ బతకదు. కాబట్టి మన దగ్గర దాని మనుగడ అంతంతే. వేడి నీళ్లు, ఎండకు ఉ ండడం ద్వారా వైరస్‌ను చంపేయొచ్చు. తరచూ వేడి నీళ్లు తీసుకోవడం అసవరమని సూచిస్తున్నారు. కరోనా పాజిటివ్ వచ్చి కోటుకున్న వారు అనుభవ పూర్వకంగా చెబుతున్నది కూడా ఇదే. వేడినీళ్లు తాగడం, విటమిన్ సి తీసుకోవడం తదితర జాగ్రత్తలు చెబుతున్నారు. వైరస్‌లోని కణం సైజు 400 నుంచి 500 మైక్రాన్లు ఉంటుంది. చేతులపై వైరస్ ఉండేది కేవలం 10 నిమిషాలే. శానిటైజర్లతో కడిగితే వైరస్‌ను చంపేయొచ్చు. వేడి ఉప్పు నీటితో గార్గ్లింగ్స్ తీసుకుంటే టాన్సిల్స్‌కు కారణమయ్యే క్రిములను చంపేయొచ్చు. కరోనా రాకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై అవగాహన కల్పించడంతో పాటు జర్వం, జలుబు లాంటి ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించింది.

## దసరా కథల పోటీ

దసరా సందర్భంగా పాలపిట్ట-జైనీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో - దసరా కథల పోటీ- నిర్వహిస్తున్నాం. మొదటి బహుమతి- రూ. 10,000, రెండో బహుమతి- రూ. 5000, మూడో బహుమతి- 3000. ఒక్కొక్క కథకు వెయ్యి రూపాయల చొప్పున పది కథలకు ప్రత్యేక బహుమతులు అందజేస్తాం. కథలకు పేజీల నిడివి లేదు. ఎన్ని పేజీలయినా, ఎన్ని పదాలయినా ఉండొచ్చు. ఇతివృత్తం రచయితల యిష్టం. ఎలాంటి షరతులు లేవు. కథ కథగా ఉండటమే ప్రధానం. తెలుగు కథకులు ఎక్కడి వారయినా ఈ పోటీలో పాల్గొనవచ్చు.

కథలు పంపడానికి చివరి తేదీ 15 ఆగస్టు 2020. కథలను ఈమెయిల్‌లోనూ, పోస్టులోనూ పంపవచ్చు.

చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, 16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాద్-500 036, ఫోను: 9848787284

## కరోనా కష్టాలపై రాష్ట్రాలకు దక్కని ఊరట

### కేంద్రం నుంచి సాయంపై కానరాని స్పష్టత

### ఉపాధి రంగాలపైనా దూరదృష్టి కరవు

న్యూఢిల్లీ,జులై22(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారిపై పోరుకు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ విషయంలో ఉమ్మడి వ్యూహం అవసరమని గతంలో సిఎంల వీడియా కాన్ఫరెన్స్ సందర్భంగా ప్రస్తావించిన ప్రధాని మోడీ ఇప్పుడా విషయాన్ని మరచినట్టు ఉన్నారు. ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపైనా ఇప్పుడు పెద్దగా మాట్లాడడం లేదు. సిఎంలు ఇచ్చిన అనేక సూచనలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలియదు. ఆర్థిక అంశాలపై అనేక ప్యాకేజీలు ప్రకటించినా వాటి ఫలితాలు కానరావడం లేదు. అనేక రంగాలు ఇప్పటికీ కోలుకోలేదు. ఇంకా ప్రజలు ఉపాధి దక్కక ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రాలు ఇచ్చే సూచనల ఆధారంగానే వ్యూహం రూపొందుతుందన్న ప్రధాని ఇప్పుడా విషయం ప్రస్తావించడం లేదు. కరోనా కష్టాలు,నష్టాలను ఎలా గట్టెక్కాలో చెప్పలేక పోయారు. దేశంలో ఆర్థిక కార్యకలాపాలు ఊపందుకోనున్నాయని మోడీ వ్యాఖ్యానించినా నష్టపోయిన రంగాలను ఎలా ముందుకు తీసుకుని వెళతారో చెప్పలేకపోయారు. ఆర్థిక కార్యకలాపాలను పూర్తిస్థాయిలో పునఃప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మాత్రమే చెప్పారు. పెద్ద సంఖ్యలో వలస కార్మికులు తమ గ్రామాలకు వెళ్లిపోయారు. వెళ్లినచోటా పనులు లేక పోవడంతో ఆందోళన చెందుతున్నారు. తెలంగాణ వంటి రాష్ట్రాలు అవసరమైన కూలీలను వెనక్కి పిలుపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పారిశ్రామిక కార్యకలాపాల పునరుద్ధరణ సమస్యగా మారింది. కరోనా విజృంభించడంతో పనులకు రావాలంటేనే ప్రజలు భయపడు తున్నారు. ఇక రాష్ట్రాలకు కూడా అనేక సమస్యలు ఉన్నాయి. కరోనా విజృంభణ కొనసాగుతున్న నేపథ్యంలో దానిని అదుపు చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. కరోనా, లాక్‌డౌన్‌లతో దారుణంగా దెబ్బతిన్న ఆర్థిక రంగాన్ని గాడిన పెట్టేందుకు ఎలాంటి వ్యూహం అనుసరించబోతున్నారో ప్రధాని మోడీ సిఎంలకు వివరించలేక పోయారు. అలాగే వారు కోరినట్లుగా రుణ పరిమితిని పెంచడం, ఆర్థికంగా ఆదుకోవడంలోనూ ఎలాంటి హామీ ఇవ్వడంలేదు. అలాగే ఏయే రంగాలను ఎలా ఆదుకోబోతున్నదీ చెప్పడం లేదు. మొత్తంగా చూస్తే ప్రజలను వారి ఖర్మకే వదిలేసారన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. ఇప్పటి వరకు తీసుకున్న నిర్ణయాలు చూస్తుంటే పెద్దగా ప్రజలకు ఉపయోగ పడే అంశాలు ఏవీ లేవు. రైళ్లకు టిక్కెట్లు పెట్టుకోమన్నారు. విమానాల్లో వచ్చే వారికి లక్షకు తక్కువ కాకుండా టిక్కెట్ పెట్టారు. క్వారంటైన్‌లో ఖర్చులు వారే భరించేలా చేశారు. పెట్రోల్ ధరలు విపరీతంగా పెంచారు. ఈ దశలో ఇక సామాన్య, మధ్య తరగతి బతుకులు మరింత దుర్భరంగా ఉంటాయని హెచ్చరికలు చేసినట్లుగా కేంద్రం తీరు ఉంది. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలకు ఆర్థిక సాయం అందించాలన్న వినతులపై స్పష్టమైన హామీ కూడా ఇవ్వలేదు. దాదాపు ఐదో నెలలోకి ప్రవేశించినా కేంద్రం ఎలాంటి అడుగు వేస్తుందో ప్రధాని మోడీ సిఎంలతో పంచుకోలేక పోయారు. కేంద్రం వ్యూహం ఏమిటి...రాష్ట్రాలు వాటిని ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలన్న సూచన కానరావడం రాలేదు. సంక్షోభం నుంచి బయటపడేందుకు కేంద్రం ఒక స్పష్టమైన వ్యూహంతో ముందుకు రావాల్సి ఉన్నా ఎందుకనో నాన్చుడు ధోరణి కనబరుస్తున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ కరోనాపై పోరులో నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర సర్కారు అసలు సత్తా ఏమిటో దేశ ప్రజలకు స్పష్టమౌతోంది. అందరికన్నా ముందే లాక్‌డౌన్ ప్రకటించామంటూ భుజాలు చరుచుకున్న కేంద్ర పెద్దలు అంతకు ముందుగాని, ఆ తరువాత గాని చేసిందేమిటో అర్థం కావడం లేదు. నిజానికి ప్రపంచ ఆరోగ్య సంస్థతో పాటు ఐక్యరాజ్యసమితి కూడా కరోనా నివారణకు లాక్‌డౌన్ ఒకటే ఔషధం కాదని, ఆ తరువాత చేయాల్సిందెంతో ఉందని పదేపదే చెప్పాయి. బ్యాంకులకు భారీ మొత్తంలో రుణాలు ఎగ్గొట్టిన సంస్థలకు రూ. వందల కోట్ల రాయితీలు ప్రకటించిన కేంద్రానికి అదే సమయంలో భారీ సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించే చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ఆదుకోవడానికి చేతులు రావడం లేదు.

## ఆర్థికంగా దెబ్బతిన్న రంగాలకు దక్కని చేయూత

### -కరోనా కష్టాలతో ప్రజల్లో ఆందోళన

న్యూఢిల్లీ,జులై22(ఆర్ఎన్ఎ): ఆర్థికంగా దెబ్బతిన్న రంగాలను, రాష్ట్రాలనుఆదుకోవడంలో కేంద్ర సర్కారు వద్ద నిర్దుష్ట ప్రణాళికేమీ ఉన్నట్టు కనిపించడం లేదు. ఎందుకంటే రాష్ట్రాలకు ఆర్థికంగా ఎలాంటి సాయం అందడం లేదు. ఈ సంక్షోభ కాలంలో సామాన్య పేదల చేతుల్లో డబ్బులుండటం కీలకం. కుటుంబానికి నెలకు కనీసం పది వేల రూపాయలన్నా ఇవ్వాలని, ఒక ఉద్దీపన ప్యాకేజిని ప్రకటించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. అమెరికా, జర్మనీ, బ్రిటన్ తదితర దేశాలు ఆ పని ఇప్పటికే చేశాయి. మనం అదే పని చేయడానికి కేంద్రం వద్ద వనరులూ ఉన్నాయి. కానీ, మోడీ ప్రభుత్వం నుంచి అలాంటి హామీలు రావడం లేదు. ప్రజలు దిక్కుదోచక తలలు పట్టుకుంటున్నా కేంద్రం తీసుకునే చర్యలు కానరాక ప్రజలు గందరగోళంలో పడుతున్నారు. కరోనా వైరస్‌తో ఎక్కడికక్కడ రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడుతున్నాయి. ఆ పోరాటాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఉదారంగా తమకు నిధులు విడుదల చేయాలని రాష్ట్రాలు చేస్తున్న విజ్ఞప్తిని మోడీ ప్రభుత్వం బేఖాతరు చేస్తున్న తీరు విస్మయాన్ని కలిగిస్తోంది. కనీసం ఎఫ్ఆర్‌బిఎం చట్టానికి సవరణలు చేసి, అధిక రుణం తెచ్చుకునే వెసలుబాటు కల్పించాలన్న రాష్ట్రాల సూచనలను కేంద్రం పట్టించుకోవడం లేదు. దీనిపై తెలంగాణ సిఎం కెసిఆర్, ఎపి సిఎం వైఎస్ జగన్‌లు పదేపదే కోరుతున్నా పట్టించుకోలేదు. తాజాగా పెంచిన పెట్రో సెస్సు వల్ల వచ్చే సొమ్ములో సైతం రాష్ట్రాలకు ఏమీ రాదు. గతి లేక, సొంతూళ్లకు వెడుతున్న వలస కూలీల రైలు ఛార్జీలను సైతం రాష్ట్రాల మీదకు తోసేశారు. మరోవైపు విదేశాల్లో చిక్కుకుపోయిన భారతీయులను స్వదేశానికి తీసుకు వస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. దేశం కానీ దేశంలో నానాకష్టాలు పడుతున్న మన వారిని తీసుకు రావాల్సిన సమయంలో వారికి లక్ష రూపాయల టిక్కెట్ భారం...క్వారంటైన్‌లో సొంతఖర్చుల భారాన్ని మోపారు. లక్షలాదిగా వస్తున్న వీరి విషయంలో ఏం జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న ప్రశ్న ఆందోళన కలిగిస్తోంది. విమానాశ్రయాల్లో దింపేసి రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యతంటూ చేతులు దులుపుకుంటున్నారు. కేంద్ర సర్కారు ఏం చేయనుందన్నది దీంతో తెలిసిపోతున్నది. దీంతో రైతులతో పాటు, వ్యవసాయ కూలీలు ఆ రంగంపై ఆధారపడిన ఇతరుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. సాఫ్ట్‌వేర్‌తో పాటు ఇతర సేవా రంగాల పరిస్థితి కూడా నానాటికి తీసికట్టుగా మారుతోంది.

## వర్షాలతో పత్తి రైతుల ఆనందం

ఖమ్మం,జులై22(ఆర్ఎన్ఎ): వరుణుడు కురుణ చూపించడంతో అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. దీంతో ఆయా మండలాలలో ఓ మోస్తారు వర్షం నమోదు అవుతోంది. ముఖ్యంగా పత్తి సాగు చేసిన అన్నదాతలకు ఈ వర్షాలు ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నాయి. సీజన్ ఆరంభం నుంచి భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు కురుస్తున్న వర్షాలకు ఉపశమనం పొందుతున్నారు. వాణిజ్య పంటలు ప్రాణం పోసుకుంటుండగా, ఆరుతడి పంటలకు మంచి అనుకూల వాతావరణం ఏర్పడింది. పలు మండలాలలో ఓమోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇప్పటికే వాతావరణశాఖ అధికారులు పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.